అభ్యుదయ



జూన్ 1989 ★ రూ. 2-50

బిచ్చగాడి పాట

—అనిసెట్టి సుబ్బారావు

గుండె తడబడినదీ
గొంతు తడుపమ్మా!
తులసికోటకు నీరు
తోడి నంతమ్మా!
కాలిపోయే యిల్లు
చల్లార్చి నంత!
పనికిరానీ చిరుగు
పడవేయి తల్లీ!
స్వామివారికి వలువ
చదివించి నంత!
శిధిలాన ప్రాకార
మెత్తి నంతమ్మా!
బిడ్డకొక పిడికిలీ
విడువమ్మ తల్లీ!
నట్టింట దీపమే
నిలిచి నంతమ్మ!
పడి నడిచి వచ్చాము
ప్రాణి నిలుపమ్మా!
అంగిట్లో ప్రాణాలు అణిగి పోతున్నాయి!
గుండెతడబడినదీ గొంతుతడుపమ్మా!
మంచు పొగగా చలికి మారి పోతున్నాము
పనికి రానీ చిరుగు పడవేయి తల్లీ!
పేలికై చేతిలో వాలిపోతున్నాడు
బిడ్డకొక పిడికిలీ విడువమ్మ తల్లీ!

అభ్యుదయ

సాహిత్య మాస పత్రిక

సంపాదకుడు : ఏటుకూరి ప్రసాద్

సంపుటి 7 జూన్ 198౮ సంచిక : 7

ఈసంచికలో

ముఖచిత్రరచన : మాగోఖలే

'మహాప్రస్థానం' ఆత్మకథ

శ్రీశ్రీ

లండన్ నగరంలో వెలువడుతున్న "విదేశాంధ్ర ప్రచురణల" నిమిత్తం నా "మహాప్రస్థానం గీతాలను టేప్ రికార్డు చేసి, నా కంఠధ్వని ఉన్న casette తో బాటు, నా సొంత దస్తూరిలో అన్ని గీతాలనూ facsimile రూపంలో విడుదల చేసే సందర్భంలో ముందుమాటగా ఏదైనా చెప్పమని ప్రచురణ కర్త హోదాలో మిత్రుడు డా॥జి కృష్ణమూర్తి నన్నడిగారు. అప్పుడు చలంగారి యోగ్యతా పత్రాన్నే చదివేద్దామనుకున్నాను. "మీఅభిప్రాయాలే వినిపించాలన్నారు" మిత్రులు. "సరే" అన్నానేను.

....

చలంగారి చేత పని కట్టుకొని ప్రశంసా వాక్యాలు వ్రాయించినవాడు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి. ఆరోజుల్లో రుక్కాయి నాకు అతని మాటల్లోనే, "అనధికార పబ్లిసిటి ఆఫీసరు"గా పనిచేసేవాడు. నా గీతాలన్నీ ఎక్కడెక్కడ అచ్చయినవో ఒకనోటు బుక్కులో రాసుకునేవాడు, చాల మట్టుకతని కవి కంఠస్థం ఒక మారతను మా యింటికివచ్చి, అప్పటికి అసంపూర్ణంగా ఉన్న "జగన్నాథుని రథచక్రాలు" చూశాడు, మహాప్రస్థానం గీతాలన్నిటిలోనూ ఏకబిగివి రాయనిది ఇదొక్కటే, "కవితా!ఓకవితా!" వంటి సుదీర్ఘ గీతాన్ని కూడా ఒకే ఊపులోరాశాను "వస్తున్నా యొస్తున్నాయ్"కి పేరడీగా "వెళిపోయాయ్ వెళిపోయాయి" అంటూ జరుక్క 'అశ్వాసాంతం' రాసి "భారతి"లో అచ్చువేయించాడు. దానితో నాకు తొందర పుట్టి "రథచక్రాలు" పూర్తిచేసాను, మరుసటి నెల "భారతి"లో అది వెలువడింది.

1940లలోనే "మహాప్రస్థానం" ప్రెస్ కాపీ సిద్ధం చేశాను. జనార్ధనరావు మరణ వార్త వినగానే ఈ పుస్తకం అతనికే అంకితం అనుకున్నాను. ఆరోజే (1938లో ఒకరోజు) "తలవంచుకు వెళిపోయావా! నేస్తం" అంటూ అంకిత గీతం సిద్ధం చేశాను. తర్వాత 1950 నాటికిగాని ఈ గ్రంథ ముద్రణ కాలేదు.

"నళినీకుమార్" అనే మిత్రుడు చేసిన ధనసాహాయంతో మొదటిముద్రణ వెలుగు చూసింది. అది నా నలభయ్యో ఏట నా మిత్రుడిచ్చిన కానుక. జేమ్స్ జాయిస్ Ulysses కూడా అతని నలభయోట ఏట పారిస్‌లో అచ్చయింది.

ఆ తర్వాత "మహాప్రస్థానం" ముద్రణలు విశాలాంధ్ర ప్రచురణల ద్వారా రమారమి ఇరవైసార్లు జరిగాయి. అందుచేత ఇప్పుడు కొత్తగా ఈ లండన్‌ముద్రణ యెందుకని నేననుకున్నాను. దీనికి శ్రీ పురిపండా వారు చెప్పిన కారణం ఇది: 'మహాప్రస్థానం' ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం'. ఆయనింకా ఇలా అన్నారు. "నాకు తెలిసినంతమట్టుకు మరే భారతీయ భాషల్లోనూ 'కవితా!ఓకవితా!' అంత గొప్పగీతం రాలేదని. ఈ ప్రచురణకు మరో ముఖ్య కారణం ఉంది. ఇది నా సొంత దస్తూరీ. సొంత గొంతుక. కవితా ప్రకాశనంలో ఏ భాషలోనూ. ఎప్పుడూ, ఎక్కడా కనీ విని ఎరగని కొత్త పద్ధతి ఇది

....

"మహాప్రస్థానం" గీతాలన్నీ 30 లలో రాశాను, ("నిజంగానే", "గర్జించు రష్యా!" 41 లో, "నీడలు" 47లో రాశాను.) 30 నుంచి 40 దాకా సాగిన శతాబ్దాన్ని చరిత్రకారులు Hungry Thirties అంటారు. అప్పుడే అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం ప్రపంచమంతటా వ్యాపించింది (ఒక సామ్యవాద రష్యాలో తప్ప) ఆదశాబ్దంలోనే రెండవ ప్రపంచ యుద్ధానికి రిహార్సల్సుగా స్పెయిన్ అంతర్యుద్ధం సాగింది ఆడెన్, స్పెండర్, డేలూయిస్, డిలాన్‌థామస్, జార్జిబార్కర్ మొదలయినవారు గొప్ప రచనలు చేసింది ఆ కాలంలోనే. ఇండియన్ ప్రోగెసివ్ రైటర్స్ మానిఫెస్టో అప్పుడే ఇంగ్లాండు నుంచి వెలువడింది. ఇన్ని యిన్ని ప్రవహాల మధ్య నా మహాప్రస్థాన గీతాలు కూడా ప్రవహించాయి.

ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలదు "సామజికవాస్తవికత " అంటారనీ, దీనికి వెనుక దన్నుగా "మార్క్సిజం" అనే దార్శనికత ఒకటి వుందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తి సామాజిక స్పృహయాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది.

ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో "నేను సైతం ప్రపంచాగ్నికి" ఇత్యాదీ గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంథిక శైలికీ, గణబద్ధ ఛందస్సుకు గుడ్‌బై కొట్టేశాను. ఇదే గురజాడ అడుగుజాడ. అంతవరకు సుమారు వెయ్యేళ్ళు అన్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండి దారినుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రథాలూ, పల్లకీలు, గుర్రబ ్ళ వెళ్ళే దారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్ళూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను,

ఇది టెక్నిక్‌కు సంబంధించింది. గ్రాంథికంలో రాసే వృత్తాలు రథాల్లాంటివి పల్లకీల్లాంటివి. గురజాడ వాడుక భాషలో రాయమన్నాడు. మాత్రాఛందస్సులు వాడమన్నాడు. నేనందుకే ఉత్సాహంతో, ఉద్రేకంతో ఉద్యమించాను. ఇక విషయం లోకి వస్తే, అందమైన అబద్ధాలలోకన్నా. నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనీయమవుతుందని విశ్వసించాను. దీనితో మహాప్రస్థాన గీతాలతో సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టడం జరిగింది.

దీని తర్వాత మెట్టు సామ్యవా వాదస్థవికత. దీన్నింకా మనం అందుకోలేదు. అందుకోకుండా పెట్టుబడిదారీ గుంట నక్కలు పెద్దపెద్ద కుట్రలే చేస్తున్నాయి, అందుకు మద్ధత్తుగా సాహిత్యంలో క్లాసిజం నిలబడింది,

ClassIcism Herbert Read ఇలా అన్నాడు "Classicism let it be said without further preface, represents for us now and has always represented, the forces of oppression. Classicism is the intellectual counter part of political tyranny. It was so in the ancient world and in the medievl empires; it was renewed to express the dictatorships of Renaissance and has ever been the official creed of Capitalism"

క్లాసిసిజంతో బాటు జాతీయ దురహంకారము కూడా అభ్యుదయ నిరోధకమైన దే దీనికి అంతర్జాతీయ దృక్పథమే విరుగుడు. "చీనాలో రిక్షావాలా, చెక్ దేశపు గని పనిమనిషి" అంటూ నేనీ అంతర్జాతీయ తత్వాన్నే ఆహ్వానించాను. బడుగు దేశాల వారు నాఇల్లు, నాదేశం అనుకుంటే అందులో అసంమజసం ఏమీలేదు. కాని ఈ భావాలు మరీ ప్రకోపించి వెర్రితలలు వేస్తేనే ప్రమాదం. అప్పుడు నాయిల్లు నాదేశం అంటే పొరుగింటిని కొల్లగొట్టడమూ, ఇతర దేశాలను దోచుకోవడమూ జరుగుతాయి. సునిశితమైన అంతర్జాతీయ దృష్టిలో ఈ దోపిడిని గుర్తు బట్టితిప్పి కొట్టడంకంటె మరో మహత్తర కర్తవ్యం మంచి కవిత్వాని కుండబోదని నేనంటాను.

"మహా ప్రస్థానం"లో నేను చేసిందంతా రుగ్మతను నిదానించడం మాత్రమే. "ఇదీ మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు!" అన్నాన్నే ను. ఇది సర్తైన రోగ నిదానమే కాని ఇంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెదకాలి, పైపైపూతలతో ఈ జబ్బుతో కుదరవు. కావలసింది శస్త్ర చికిత్స. దాన్నే "విప్లవం" అంటున్నాను.

"మహాప్రసానం"లో అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలూ ఉన్నాయి. విప్లవ సాహిత్యం లేదు. "విప్లవ సాహిత్యం అంటె ఏమిటి? సామాన్య ప్రజానికాన్ని విప్లవాచరణ కుద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే!

విదేశాంధ్ర ప్రచురణలు, లండన్ ''మహాప్రస్థానం''లో రాసిన నామాట' నుంచి కొన్ని భాగాలు

జూన్ 15 శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ప్రచురిస్తున్నాం.

వార్తలు

కళాకారుల మతతత్వ వ్యతిరేక పోరాటం

రాజీవ్‌సక్సేనా

మతతత్వ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనేక మంది రచయితలు, కళాకారులు లక్నోనుంచి అయోధ్య వరకు ఏప్రెల్‌లో ఒక సాంస్కృతిక పాద యాత్రను నిర్వహించారు. ఇందులో 300మంది పైగా పాల్గొన్నారు. దీన్ని మతతత్వవ్యతిరేక, పునరుద్ధరణ వాద వ్యతిరేక కమిటీ నిర్వహించింది ఈ కమిటీ 1989 ఫిబ్రవరి 18, 19 తేదీల్లో ఏర్పడింది. ఈ పాదయాత్రకు కైఫిఆజ్మి (ఇప్టా), రాజీవ్ సక్సేనా (అ.ర.సం) నాయకత్వం వహించారు.

వామపక్షంలో కొంత మంది ఇప్పుడున్న పరిస్థితిని సరిగా అవగహనచేసుకోలేక పోతున్నారు. మతతత్వశక్తులకు వ్యతిరేకంగా స్వతంత్రగా పోరాడాలనే ఉద్దేశంకన్నా, రాజీవ్‌గాంధీ ప్రభుత్వాన్ని తొలగించాలన్న అభిప్రాయంతోనే పత్తమవుతున్నారు. మతతత్వశక్తులు కూడాప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి అయితే వాటి ఉద్దేశం హిందూరాజ్యం పేరుతో అధికారాన్ని హస్తగతం చేసుకోవడం. ఇవి చేస్తున్న ప్రచారం పంజాబ్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదులకు బాగా ఉపయోగపడుతోంది.

విశ్వహిందూపరిషత్తు పంజాబులో నోరుమెదపకుండా హిందీ ప్రాంతలోనే తన కార్యకలాపాలు సాగించడం యాధృచ్ఛికమేమికాదు. దీనికి ఇస్లామాబాద్ లోనూ, వాషింగ్టన్‌లోనూ కేంద్రకార్యలయాలు ఉన్నాయంటే దాని శక్తిసామర్థ్యాలేమిటో తెలుసుకోవచ్చు.

సామాజిక రాజకీయ సాంస్కృతి కవాస్తవాల్ని అవగాహన చేసుకోడానికి ఈ పాదయాత్ర బాగా ఉపయోగపడింది. ఇందులో సి.పి.ఎం పాల్గొనక పోవడం సముచితంగాలేదు. దానిక్కాకరణం ఐ.పి.ఎఫ్. అనే మాజీనక్సలైటుగూపు

పాల్గొనదమేనని తెలిసింది. అయితే సి పి ఐ తోపాటు సి పి.ఎం, సానుభూతిపరులు ఏ పార్టీకి చెందని ప్రజాతంత్రవాదులు చాల మంది పాల్గొన్నారు. గోండాలో మాత్రం ఈ పాదయాత్రను ఆహ్వానించడానికి ఏర్పడిన కమిటిలో సి.పి.ఎం సభ్యులు చేరారు

ఈ సందర్భంలో కర్నూల్ గంజ్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి కాలేజీవిద్యార్థుల యూనియన్‌లో కైఫీఆజ్మీ ప్రసంగిస్తూ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. అమాయకుల రక్తంతో ఓట్లబ్యాంకు నిర్మిస్తున్న నీతిబాహ్య రాజకీయ నాయకులను ఆయన నిశితంగా విమర్శించారు. రచయితలు కళాకారులు విద్యార్థులు పోరాడాల్సింది ఎన్నికల్లోకాదని మతతత్వానికి వ్యతిరేకంగా అని ఆయన తెలియజేశారు. రాజీవ్‌సక్సేనా తన ప్రసంగంలో హిందూ రాజ్య నినాదం పంజాబులోని ఖలిస్తానిల ఆందోళననూ ఇంకా అలాంటి ఇతర ఆందోళనలనూ పటిష్ట పరుస్తుదనీ,హిందూరాజ్య· మతతత్వవాదులకు, ఆధిపత్యం లభించినట్లయితే కాశ్మీర్‌లోని వేర్పాటువాద ముస్లిములకూ, తూర్పు ప్రాంతంలోని క్రైస్తవ వేర్పాటు వాదులకూ, దక్షిణ భారతంలోని ద్రవిడ వేర్పాటు హిందులకూ కొత్త ఊపిరి పోసినట్లవుతుందని హెచ్చరించారు,

మతతత్వ వాదులకు రామజన్మభూమి బాబరు మసీదు వివాదంలో హిందూ పేకముక్క కీలకమైన సమ్యసగ్గా తయారయిందని సక్సేనా విమర్శించారు. బాబరు మసీదును కూలగొట్టి కొత్తగా రామాలయాన్ని నిర్మించాలన్న విశ్వహిందూ పరిషత్ పిలుపు నిజానికిఉత్తర భారతదేశంలో కార్చిచ్చుల్ని సృష్టిస్తుందని సక్సేనా హెచ్చరించారు. భారతదేశంలో ప్రజస్వామ్యాన్ని హత్య చేయడానికి అది ఆఖరి దెబ్బ అవుతుందనీ, దేశభక్తులందరు మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడి దేశ ఐక్యతనూ, ప్రజాస్వామ్య వ్యవస్థనూ కాపాడాలని ఆయన కోరారు.

ఈ పాదయత్రలో రామజన్మభుమి పరిష్కారానికి రచయితలు కళాకారులు మూడు మర్గాలు సుచించారు (1) సుప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్తలు చరిత్రకారులు సామాజిక న్యాయ శాస్త్ర వేత్తలు, హిందువుల, ముస్లిములతో, ప్రజాకమిటీనిఏర్పాటు చేసి ఆ సమస్యపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరడం
(2) ఈ సమస్య క్షుణ్ణంగా పరిశీంచి తీర్పు ఇవ్వాలిందిగా ప్రభుత్వం సుప్రీం కోర్టును అడగడం. (3) ఈభవనాన్ని భారత పురావస్తు శాఖకు అప్పగించి దానిని చారిత్రక కట్టడంగా ప్రకటించడం.

అభ్యుదయ మనది మనం పోషించుకుందాం

1	శ్రీ బోయ జంగయ్య నల్గొండ	116-00
2	డా॥సి.ఆర్.రాజగోపాల్ హైదరాబాద్	116-00
3	శ్రీ వి. సుబ్రమణ్యం హైదరాబాద్	116-00
4	డా॥పరిమళా సోమశ్వర్ హైదరాబాద్	116-00
5	శ్రీ సి. వామనమూర్తి కటక్	105-00
6	శ్రీమతి గూడవల్లి సావిత్రి, గుంటూరు	100-00
7	డా॥ గోపులింగారెడ్డి, కరీంనగర్	116-00
8	శ్రీమతి పద్మావతమ్మ ప్రొద్దుటూరు	116-00
9	శ్రీ టి. రామాంజనేయులు, మాచర్ల	50-00

అభినందనలు

ప్రముఖ అభ్యుదయ నవలా రచయిత్రి కుమారి వాసిరెడ్డి సీతాదేవి గారికి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు పట్టాన్నిచ్చి గౌరవించింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంతకుముందే గౌరవ డాక్టరేటు ప్రదానం చేసిన విషయం విదితమే.

ప్రఖ్యాత అభ్యుదయ కవి ఆచార్య సి.నారాయణరెడ్డి గారిని తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు ఆయన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఉండి చేసిన సేవలు తెలిసినదే.

○

కవిత

ఇంకెక్కడి "విప్లవం" నేస్తం?

- ఎస్వీ

ఇంకెక్కడి 'మార్క్సిజం' నేస్తం?
నువ్వు అధికార పల్లకీ మోస్తున్న బోయీ వైయ్యాక
మంత్రుల.... ముఖ్యమంత్రుల కాళ్లపై నీ జెండా ఎగిరాక
'కాషాయం' నీ విజ్ఞానకేంద్రాలను కలుషితం చేశాక
నమ్మకమైన మిత్రపక్షానివై 'నువ్వు' పాలకవర్గాలతో రాజీపడ్డాక—

ఇంకెక్కడి 'లెనినిజం' నేస్తం?
ఒకడి దయాదాక్షిణ్యాలకు నీ సిద్ధాంతాలను తాకట్టుపెట్టాక
ఒకడు రాల్చే సూడిద బూడిదకోసం నీ నోరు తెరుచుకున్నాక
'పోరాటం' బాటనొదిలి 'నువ్వు' కాళ్ళబేరానికొచ్చాక—

నువ్వు చాలా తెలివైనవాడివి నేస్తం!
నువ్వీ వ్యవస్థతో మమేకమౌతూనే
దీనిపై పోరాటం ప్రకటిస్తున్నావ్
నువ్వీ శత్రువర్గంతో విందారగిస్తూనే
విమర్శల తాంబూలాలు ఊస్తున్నావ్
'పచ్చని' దుప్పట్లో ముడుచుకొని
వెచ్చని 'అరుణ' స్వప్నాలు కంటున్నావ్
పదును తప్పిన నీ చేతి ఆయుధాలను
జెండాపై ప్రతిష్ఠించి— జేజేలు కొడుతున్నావ్

సమ్మెలు జేస్తున్నావ్— సత్యాగ్రహాలు జేస్తున్నావ్
ఊరేగింపులు దీస్తున్నావ్- ఉత్సవాలు జరుపుతున్నావ్

వర్గ పోరాటానికి దూరమై
స్వర్గానికి నిచ్చెన లేస్తున్నావ్-
ఇంకెక్కడి విప్లవం నేస్తం ?!
నీ వర్గశత్రువు జెండా నీడకింద
నీ గుండె రెపరెపలాడాక
వాగ్దానాల దానధర్మాలతో నీ కళ్ళు చెమ్మగిల్లాక
ఏకపాత్రాభినయాల విన్యాసాలతో
నీ చేతి చప్పట్లు ప్రతిధ్వనించాక
జనాకర్షక నినాదాల నడుమ
నీ కార్యాచరణ అడుగంటిపోయాక ?

....0....

పక్షులు

— కోటం చంద్రశేఖర్

కాయితాల కొమ్మలమీద నా అక్షరాల పక్షులు—
సమరవీరుల అమరయోధుల సిద్ధాంతాల్ని పాటలుగా పాడుకుంటూ-
నిశ్శబ్దాన్ని నరుక్కుంటూ—
మాయదారి వ్యవస్థకి అదేం పోయేరోగమో కానీ నా పక్షుల
చుట్టూ ఊచల్ని ఉంచుంది-
ఆంక్షల్ని విధించింది- నోళ్ళు తెరవకండని శాసించింది-
నా పక్షులకి భయంలేదు- ఒకటే ఆలోచన—
ఊచల ఊపిరి ఆర్పుదామని- ఉక్కుముక్కుల్తో ఎదిరిద్దామని-
దిక్కుల్లోకి ఎగుర్దామని-

రివర్సిబుల్ కోటు

— కనకప్రసాద్

చిన్నవాణ్ణా చితకవాణ్ణా కవిని
నన్ను పోల్చుకునే ఉంటారు తమరు
బెజవాడ సాహిత్యపురంలో
పగటిపూట ఎర్రగానూ రాత్రిపూట నల్లగానూ కనపడే
లగ్జరీ రివర్సిబుల్ కోటు మార్చి మార్చి తొడుక్కుంటూ
నగ్జలయిట్లని తలదన్నేలాగ ఘాటయిన విప్లవకవితలు అమ్మేవాణ్ణి పగలు
ఎగ్జయిటింగ్‌గా ఉంటుందిలెమ్మని
నడిబజారులో కామోత్సవాలు జరిపించేవాణ్ణి రాత్రి
నేను కేవలం నేను మాత్రమేకాదు.
ఇవాల్టి కవులకి ఫేషనబుల్ సింబల్ని.
సాయం సూర్యుణ్ణి షాంపేన్లా కలుపుకుతాగి
తురాయిచెట్లకి తుపాకుల్ని పూయించి
ఇమేజరీ చమక్కుల్తో సమాజాన్ని నాలుగు మడతలు మడిచి
సొంతం జేబులో వేసుకోగల సాహితీ ఇంద్రజాలికుణ్ణి.
వేషేన్, వేషేన్
వేసేను వేసేను వేషాలువేస్తే వేస్తాన్నేను, రాస్తాన్నేను
కీర్తి సముద్రపు అవతలి అంచులు ఎగిరో గెంతో చూస్తాన్నేను
తుక్కువాణ్ణే కాను !
చిన్నారి పొన్నారి చిరుతకూకటినాడె ఎక్కుపెట్టితి మినీకవితా తుపాకి
కన్నీరు మున్నీరుగా అభ్యుదయమ్మ కార్చికార్చి
ఇట్లు రొమాంటిక్ వెర్రియలిస్టుగా తేలితిని కొసాకి.
ఎవరువాళ్ళు వెర్రివాళ్ళు
•తెల్లటివన్నీ పాలూకావు, ఎర్రటిదంతా విప్లవమూ కాదని,

ఏలూర్రోడ్డు మొగలో నిలబడి చెపలాయి కూతలు కూస్తున్నారు.
ఆపండి !
నిన్నటియుగం శ్రీశ్రీది అవునో కాదోగాని
నేటియుగం మాత్రం ఖచ్చితంగా నాదీ, ఇంకో ఇద్దరు ముగ్గురు
నోటున్నవాళ్ళదే.
ఇవిగో ఎడిటర్లు రాసిచ్చిన క్రయచీటీలు
ఇంకు తడన్నా ఆరకుండా ఇక్కడ ఉన్నాయి చూడండి.
చిన్న రహస్యం ఒకటి చెపతాను రండి
మొన్నమొన్నటిదాకా ఆంధ్రనీతీ, ఆంధ్రఖ్యాతీ
ఇంకా నువ్వూ నేనూ ఎక్స్ అండ్ వై
తాగినంతకాలం ఆవిడ రొమ్ముల్లో పాలే వచ్చాయికాని
ఇప్పుడు సాహితి బాగా పెద్దదయిపోయింది, పోనీ
రొమ్ములుమాత్రం వాదిలేదిలేదని హతించి
కాస్త మోటుగా పీలుద్దాం తలో గుక్కెడూ రక్తం.
రాసుకున్నవాడికి రాసుకున్నంత మహదేవా.
అధునిక ఆవకాశ వేదులం బయల్దేరాం
నువ్వూ మాతో వస్తావా రావా ?

మీరే నయం

— భద్రాచలం శశితేజ్

మా ఉద్యోగాల భర్తీని
మాటిమాటికి వాయిదా వేస్తారు—
ఓ భద్రాచల రాముడూ!

సింహాచల అప్పడూ!
మీ కళ్యాణాల ఖర్చులు
ఎంతదాటినా యథావిధిగా జరిపేస్తారు

ఓ పాయ

— ఒబ్బిని

ఓ పాయెప్పుడూ
గస్తీ ప్రవాహంలా పారుతూనే
ఉంటుంది.
ఓ పాయెప్పుడూ
కాంతిఖడ్గంలా మెరుస్తూనేఉంటుంది
ఓ పాయెప్పుడూ
శస్త్రవైద్యుడిలా ప్రత్యక్షమవుతూ
నే ఉంటుంది.


....

వెంట్రుక ప్రాయంగా
హేళన చేయబడుతున్నప్పుడూ
అక్షరం రానినేరానికి
అంధకార యుగాలని ప్రసాదిం-
చేప్పుడూ
క్షణవ్యామోహాల్లో బంధించి
సోషల్ఎయిడ్స్'కి గురిచేస్తున్న-
ప్పుడూ.
ఆ పాయే
నిన్ను ఆదుకొనే గంగ.
ఆ పాయే
నీకు దారిచూపించే ఫ్లడ్‌లైటు.
ఆ పాయే
నీకు జీవంపోసే డాక్టరు,

....

మరపుమంచుని ఇంజెక్ట్ చేస్తూ
గిల్లి కజ్జాలాడుతూ, భయపెడుతూ,
సైన్సు బూచితో ప్రకృతి తాండవా-
న్ని ప్రదర్శించి
వెనవెనక్కి పారిపొమ్మని,పరు-
గెత్తిస్తూ
బెదిరించే వాళ్లకి
ఆ పాయే
"మూడోకన్నై"
మురుగాళ్ల మీద కూర్చున్న వాళ్లని
సైనికదళంగా మార్చి "మార్చ్"
చేయిస్తుంది

....o....



జానపదగేయం 'సుభద్రసారె' - సాంఘిక మానసిక విశ్లేషణ

— యండపల్లి పాండురంగ

జాతి జీవన విధానానికి సజీవ ప్రతిరూపం జానపదగీతం. తరతరాలుగ క్రోడీకరింపబడిన మానవులందరి అనుభవాలు, వ్యవస్థల అలవాట్లు అంతర్వాహినిగ కాక ప్రత్యక్ష సత్య ప్రమాణాలుగా- ప్రధానాలుగా ఉద్భవించి-ఆ ఆలోచనా పరిధిలో పరిభ్రమించి పరిఢవిల్లే ప్రాచుర్యాలకి జానపదగేయాలు నిదర్శనాలవుతాయనడంలో సందేహించనక్కర్లేదు. లోకజ్ఞుడైన అజ్ఞాత జానపదకవి తన అనుభవపూర్వకమైన దైనందిన జీవన సమస్యల్నిగాని, జీవనవిధానాల్నిగాని, వీక్షణ పరిశీలనకు నోచుకొన్న ప్రకంపనలనుగాని, తనకు పరిచయమున్న పాత్రలకి సమన్వయించి, పరికల్పనచేసి శ్రావ్యమైన ఫణితిలోపాటగా కూర్చుతాడు. సమాజంలోని పరిణామాల ప్రభావాల్ని వ్యంగ్యార్థంతో ప్రతిఫలింపజేసే నిర్విరామమైన కృషి జానపదగేయంలో ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే- లోకవ్యవహారాలకి, లోకంలోని తీరుతెన్నులకు సత్యసామీప్య స్వరూపమే జానపదగీతం. జానపదుల హృదయతరంగాలలో ఉరకలువేసే ఆనందం, అనురాగం, అనుభవం, ఆందోళన, దుఃఖం, భయం, విశ్వాసం, ఉద్వేగం మొదలైన గుణాలన్నీ జానపదగేయంలో ఉద్ధృతంగా ప్రవహిస్తాయి. ప్రజల మనస్తత్వాలు, మానసిక దౌర్బల్యాలు, మూఢవిశ్వాసాలు, సంఘ ఆచారవ్యవహారాలు జానపదగేయం ప్రత్యక్షరంలోను, భంగ్యంతరంగా తొంగిచూస్తుంటాయి. కారణం- ఈ పాటలకి పుట్టుకస్థానం లోకమేగాబట్టి.

మనకు లభ్యమవుతున్న వీరగాథలు, స్త్రీల పౌరాణికపు పాటలు, లాలిపాటలు, శ్రామికగేయాలు మొదలైన జానపదగేయాలలో వివిధఅంశాలతోపాటు

సంఘదురాచారాలు, మానసిక దౌర్బల్యాలుకూడా సునిశితధోరణిలో చిత్రింపబడి నట్లు అయా జానపదగేయాల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

భారత భాగవత జానపదపాటలకు సంబంధించిన "సుభద్రసారె" అనే పాటలో ప్రతిఫలించే సంఘపరమైన వ్యవస్థాగత చిత్రణ- మానసిక విశ్లేషణ క్లుప్తంగా పరామర్శించడమే ఈ వ్యాసోద్దేశం.

"సుభద్రసారె సొగసయిన పాట"- అని ఆచార్య తూమాటి దొణప్పగారు ఆ గీతాన్ని గురించి తమ పుస్తకం "జానపద కళాసంపద" [1987 ద్వితీయ పుట 62]లో ప్రశంసించారు. ఇంచుమించు ద్విపద ఛందస్సులో సాగిపోయే ఈ పాటలో చాలా నిశితమైన లోకపరిశీలన కనిపిస్తుంది. ఇందులో వచ్చే పాత్రలు- సుభద్ర, పార్థుడు, శ్రీకృష్ణుడు, అతని భార్యలు. మనకు తెలిసిన సుభద్రార్జున శ్రీకృష్ణులకి ఈ గీతంలో ప్రవర్తిల్లె పాత్రలకి చాలా వ్యత్యాసం వుంది. భారతంలోని పార్థుడు, శ్రీకృష్ణుడు— అతని భార్యలు, సుభద్ర మొ॥ మహాకవులచేత విశిష్టమైన వ్యక్తిత్వంలో— ఆదర్శవంతమైన పాత్రలుగా తీర్చి దిద్దబడినవి. ఈ గీతంలో అవే పాత్రలు లోకంలోని సామాన్యమైన వ్యక్తులకి ప్రతిరూపాలుగా కనిపిస్తాయి.

ఇందులోని పార్థుడు- ధీరోదాత్తుడైన నాయకుడుకాదు. అత్తమామల్ని పీల్చి పిప్పిచేసే దురాశాపరుడైన అల్లుడు. అహంకారం మూర్తీభవించిన మగడు,

కృష్ణుడు జగద్రక్షకుడైన భగవానుడుకాదు. చెల్లెలికాపురం నిలబెట్టడం కోసం ఆలమటించే విప్రహయుడైన అన్న.

సుభద్ర, ఆమె వదినలు భారతంలో ప్రశంసింపబడిన పాత్రలు కాదు. వగటు స్త్రీలు.

జనబాహుళ్యంలో రామాయణ భారత భాగవతాలు మిళితమై చొచ్చుకుని పోవడంవల్ల- జానపదులకి ఆయాపురాణపాత్రలతో ఏర్పడిన సన్నిహితపరిచయం వల్ల- ఆ సాంగత్యాన్ని పురస్కరించుకొని- ఆ పురాణపాత్రల పరంగా లోక

వ్యవహారాన్ని అన్వయింపజేసినందువల్ల "సుభద్ర సారె"వంటి జానపదగేయాలు ఉద్భవిస్తుంటాయి.

ఈనాడు సంఘంలో ఇంచుమించు ప్రతిఆడపిల్ల తండ్రి ఎదుర్కొంటున్న సమస్య. ఈ 'సుభద్ర సారె'లో సూటిగా వర్ణింపబడింది. ఆస్తిపాస్తుల కోసం భార్యను చిత్రహింసలుపెట్టే భర్తల రాక్షసస్వభావం— ఈ గేయంలో ప్రతి బింబిస్తుంది.

సుభద్రార్జునుల వివాహమైన కొన్నాళ్ళకు ఒకరోజు పడకటింట్లో యథా లాపమైన మాటల సందర్భంలో.

"…. అనగ పార్థుడు నవ్వి అతివ కిట్లనెను.

కుంచముతో కుంచెడు కొలిచి ఇచ్చిరిగా— కొలత పళ్ళెరాలుపెట్టె మీవారు
మానెతో మానెండు కొలిచి ఇచ్చిరిగా— మారుకట్టు చీరలు మనకు మీవారు
తవ్వతో తవ్వెండు కొలిచి ఇచ్చిరిగా— తలంటుగిన్నెలు పెట్రే మీవారు
పున్నమ్మనాడైన బూరెలొండుకొని— పుణ్యుడా రమ్మని పిల్చిరె మీవారు
అమాస్యనాడైన అట్లు వండుకొని— అల్లుడా రమ్మని పిల్చిరె మీవారు
కనుమనాడైనాను గారెలొండుకొని— కాముడా రమ్మని పిల్చిరె మీవారు."

ఈ దేశంలో ఎప్పుడు ప్రారంభమయ్యిందో తెలియదుగాని అత్తమామలు— అల్లుడికి విశేషమైన మర్యాదలు చేయడమనే ఆచారంబాగా పాతుకొనిపోయిఉంది. అలా మర్యాదలు చేస్తున్నప్పటికీ ప్రతిచిన్న విషయానికి గౌరవం చెయ్యలేదని ఆర్భాటంచేసే అల్లుడిగా "పుల్లిరుపు"మాటలతో భార్య దగ్గర "నస" పెట్టడం ఈ పాటలో స్పష్టీకరింపబడింది అర్జునుడు కోరిన గారెలు- బూరెలు— తలంటు గిన్నెలు— అట్లు మొ॥ నేటి స్కూటర్లు, ఫ్రిజ్‌లు, టి.వీలు, ఎకరాలకి ప్రతీకలు.

పెళ్ళిఅయి పుట్టింటిని- అయినవాళ్ళందరిని వదిలి భర్తవెనుక వచ్చేసిన అసహాయురాలైన భార్య అది విని ఏం చెయ్యగలదు? అయినా స్త్రీ సహజమైన ఉక్రోషంతో—

"మావాళ్ళు పేదవాళ్ళు మాకేమిగలదు— పెట్టగల పెద్దింట పెళ్ళాడతేను
అచ్చటలు ముచ్చటలు అన్నియును జరుగు…."

— అని సమాధానం చెప్పింది. భర్తమాటలకు ఎదురుచెప్పడం మహా నేరమనే సమాజం మనది. అది భర్తగా అతని అధికారస్థాయిని కించపరచి నట్లవుతుంది. సరిగ్గా ఆ స్వభావమే పార్థుడి పాత్రలో ప్రతిబింబించింది. చూడండి :—

"…. అతివపల్కులు విని గుడ్లెఱ్ఱజేసి
మాటకు ప్రతిమాట లాడుతావటలె— ఎడమమీసం దువ్వి పాదాలుఎత్తి
పాంకోళ్ళతో తన్ని- ఫక్కున నవ్వ …."

"ఫక్కున నవ్వె" అన్నపదం మగవాడి అహంభావాన్ని, తానేదో ఘన కార్యం (భార్యను తన్నడం) చేశాననే గర్వాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది. అటు తరువాత- అసహాయస్థితిలోఉన్న ఆడదాని ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో— సరిగ్గా అదేవిధమైన రీతిలో సుభద్ర-

"…. గోలుగోలుమని గోడపై కొరిగి
ముత్యాలకన్నీరు ముక్కుకే దిగెను…. చేడెవతి కన్నీరు చెక్కిళ్ళ దిగెను
భోగావతి కన్నీరు బొడ్డుక్క దిగెను…. మానవతి కన్నీరుమడమలకి దిగెను
కళ్ళకాటుక తీసి కరడాన పెట్టి…. పళ్ళ ఎఱుపుతీసి పళ్ళేనపెట్టి
వంటి సొమ్ములు భరిణెలో పెట్టి … మాసినబట్ట గట్టి మడుగుల్లుదాటి
మువ్వలా ముద్దుణ్ణి చంక బెట్టుకొని…. గంటలా కొమ్మణ్ణి చెట్టబట్టుకొని
వెళ్లెనే సూభద్ర అన్నవాడలకు …."

— పుట్టింటికి పయనమైపోయింది. ఇప్పటికి సుభద్రకు బిడ్డకూడా పుట్టి నట్లు తెలుస్తుంది. అంటే ఇంతకాలం గడిచినా- అత్తగారింటి సొమ్ముకోసం అప్పటికి "ఆశ" మాత్రం కొనసాగుతూనే ఉందన్నమాట !

సుభద్ర వంటరిగా వచ్చిన పద్ధతిని, ఆమెతీరును చూసి కృష్ణుడు అడిగిన ప్రశ్నలు సహజరీతిలో స్వభావసిద్ధంగా ఉన్నాయి చూడండి !

"…. నా ముద్దుల చెల్లెలాయేమె సుభద్ర
ఏనుగులు వుండంగ గుఱ్ఱాలు వుండ … హౌదాలు వుండగా పల్లకీలుండ
బంటూలు వుండంగ బానిసె లుండ…. కాలినడకలతోను నొంటరిగ నీవు
విడబడీ వచ్చుటకు ఒరగడ్డమేమె…."

— అని ప్రశ్నించాడు కృష్ణపరమాత్మ. "కొలత పళ్ళెరాలు పెట్టి మీ వారు—…." అని ప్రారంభించి భర్త పలికిన మాటలన్నిటిని పునశ్చరణ చేసి చెప్పి—

"….పుల్లిరుపు మాట్లాడి వురుషుడూ నన్ను
గుడ్లెఱ్ఱగాజేసి పాదాలతన్నె…. హాడలుచూవ స్తినీ అన్న నీకడకూ."

- అని కన్నీళ్ళతో వివరించింది సుభద్ర. ముద్దులచెల్లెల్ని హింసించి పంపినందుకు కృష్ణుడు, బావకు తగిన బుద్ధి చెప్పాలి. ఈ సమస్యకు చక్కని పరిష్కారమన్నా చూపాలి. ఎందుకంటే అతను జగద్రక్షకుడైన భగవానుడుకదా! కాని ముందు చెప్పినట్లుగా అతడూ లోకంలోని ఒక పాత్రేగాబట్టి అమాయకురాలైన చెల్లెలుగల ప్రతి అన్నలాగే నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడినట్లు చిత్రీకరించడం జరిగిందిగాని, పురాణకథలోని పాత్రగా పరిగణించలేదు. అపుడు కృష్ణుడు-

"చెల్లెలిని వోదార్చి చేరంగ దీసి …. కంట తడిబెట్టకు కాంతరో నీవు
తూర్పున వున్నాయి చూడి ఆవుల్లు …. అవిగోనె చెల్లెలా అరణంబునీకు
పడమటా వున్నాయి పాడి ఆవుల్లు …. "
ఉత్తరానవున్నాయి మదపుటేనుగులు…. "
దక్షిణానవున్నాయి తూరుపుగుఱ్ఱాలు…. "
కుదురుమీదున్నాయి గుండుబిందెల్లు…. "
గూట్లోను వున్నాయి కంచుగిన్నెల్లు …. "
అటకమీదున్నాయి అంచు బిందెల్లు …. "

ఫరికెల్లో వున్నాయి పతకములపేర్లు .... "
సావిట్లో వున్నాయి కావడిపెట్లు .... "
దండేన వున్నాయి వెల్ల చీరల్లు .... "
పెట్లోను వున్నాయి పట్టు చీరల్లు .... "
రత్నాల కోళ్ళకీ పట్టె మంచమ్మూ .... ముత్యాలజాలరూ పచ్చదోమతెర
వాలింపు సొమ్ములూ మందసమ్ములు .... లోపూలభామలూ దానిసలు వీరు
అవిగోనె చెల్లెలా అరణంబు నీకు .... అనుచు విష్ణుడు ఇచ్చి సతుల కడకంపె.

- బావగారు అడిగినదానికంటె ఆధికంగానే ముట్టజెప్పాడు విష్ణుమూర్తి. సుభద్ర వీడ్కోలు కోసం వదినెల దగ్గరకు పోయిన సందర్భంలో సంసారాన్నంతా దోచి పెట్టేస్తున్నాడని విలవిల్లాడే భార్యలుగానే శ్రీకృష్ణుని భార్యలుకూడా చిత్రీకరింపబడ్డారు. చూడండి :—

"ఏడో యింటివదినె వెళ్ళి వస్తాను .... యెండేన ధాన్యమ్మ యెత్తూకపోమ్మ
ఇంటి వాసాలన్ని బండిపై వేసి .... ముంజూరువాసాలు ముట్టించిపోమ్మ
ఇల్లువిరుచుకుపోమ్మ ఓముద్దుగుమ్మ .... వండీనవంటురము కట్టుకొనిపోమ్మ
కాలిమట్టెల జోళ్ళు తీసుకొనిపోమ్మ .... కట్టుకొనబట్ట ఒకటీ ఉంచువమ్మ"

— అని దెప్పి పొడిచి తమ కడుపుమంట చల్లార్చుకొన్నారు.

"అనిన గుజగుజలాడి అతివ దుఃఖించి .... అన్నరో వింటివా ఆలి మాటల్లా"

— అని ఫిర్యాదుచేసి కంటతడి పెట్టుకొంది సుభద్ర. అటు భార్యలకు ఇటు చెల్లెలకు సర్దిచెప్పి.

పదవే ఓ సూభద్ర పంపించివత్తూ .... పల్లకీ యెక్కించిపరమాత్ముడపుడూ
నవరత్నాభరణములుపట్టెమంచములు .... ఆవులూ ఆవుదాలు మేలందలములూ
కాపాడ దాసాలు కలివి అన్నియును .... కానుకలుగా యిచ్చి కమలాక్షుడంపె.

ఈనాడు ఆడపిల్లనుకన్న ప్రతిసామాన్యుని యింట ఈసమస్య కాలసర్పమై కాటువేస్తూనే వుంది. అదుపులేని భర్త గొంతెమ్మ కోరికలు తీర్చలేక అటు పుట్టింటి పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని ఎంతోమంది అభాగ్యులైన అబలలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అభిమానవతియైన స్త్రీ 'ఇదేమిటి ఈ అన్యాయ' మని ఎదురు తిరిగి ప్రశ్నిస్తే కరుడుగట్టిన కర్కశహృదయులు కఠినాతికఠినంగా శిక్షిస్తున్నారు. పాద్దుడు సాంకోళ్ళతోనే తన్నాడు కాని నేటి కిరాతకులు 'కిరోసిన్'తో నిలువెల్లా సజీవదహనం చేస్తున్న సంఘటనలెన్నో వెలుగులోనికి వస్తున్నాయి. సిరిగల సుభద్రలాంటి స్త్రీ భర్తకు కావల్సినవన్నీ బండ్లకెత్తించుకొని తీసుకుపోగలదు. మరి సామాన్యుని పరిస్థితి?

ఈ విధంగా ఈ పాటలు లోకాన్ని ప్రతిబింబింపజేస్తూ సహజచిత్రణ కలిగి అతిమనోహరంగా సాగిపోతుంటాయి మానవ హృదయాన్ని తనుపుతూ మస్తిష్కాల్ని కదిలిస్తుంటాయి. శక్తివంతమయిన సహజభాషలో తేటతెల్లంగా అలవోకగా ప్రజలనోళ్ళలో జీవిస్తూ శాశ్వతంగా నిలిచే వుంటాయి.

.... o ....



కొత్త కథకులకు - జ్ఞానగంగ! పాత కథకులకు - ప్రాణసింధు!!

— మునిపల్లెరాజు

[గ్రంథం : కథానిక-స్వరూపస్వభావాలు.

గ్రంథకర్త : డా॥పోరంకి దక్షిణామూర్తి.

పుటలు ; 638 డెమ్మీ.]

కొన్ని పుస్తకాలపేర్లను "గ్రంథస్వీకారం" కాలమ్‌లో చదువుతాం. మరికొన్నిటి "సంగ్రహాసమీక్షల్ని"చదువుతాం. మరుక్షణమే మరచిపోతాం. స్వీకారాల్లోనూ సమీక్షల్లోనూ, కనిపించకపోయినా, నోటిమాటద్వారానే విస్తృత ప్రచారాన్నిపొందే మరికొన్ని గ్రంథాలున్నాయ్. ఈకోవలోకి చేరేబృహత్‌గ్రంథం పోరంకివారిది. కారణాలు వెతకనక్కరలేదు. ఇది ఒక చారిత్రికఅవసరాన్ని పూరించటానికి వెలుగుకు వచ్చింది, దాని పుటపుటలోనూ పరిమళించేబహుళప్రయోజనం నిమిడివుంది, మన సాహిత్య చరిత్రలో మైలురాళ్ళుగా, భవిష్యత్కాలంలో గూడా నిలిచిపోయే కొద్ది పాటివిమర్శనా గ్రంథాలసరసన కాపురంచేసే కలికితురాయిగా- కూడా భాసిస్తుంది. అతిశయోక్తిగా వినిపిస్తున్నదా? అయితేమీరు ఆసాంతం వివరణ చదవవలసిందే.

శ్రవ్య దృశ్యకళల పరిధిలో- సినిమా బలవత్తరమయిన శక్తి అయితే, సాహిత్యపరిధిలో కథానిక అంతటి విస్తృత ప్రభావంగల ప్రక్రియ, అని అందరూ అంగీకరిస్తారు. కథానిక— పారిశ్రామికయుగపు ఆధ్యాత్మిక భౌతికకల్లోలాలను ప్రతిబింబించే దర్పణం. సమకాలీన మానవ జీవనయాత్రలో, అడుగడు

గునా ఎదురయ్యే ఆందోళనాభయాలను విశ్లేషించి, వుదాత్తరీతిలో సామాజిక జీవనమాలిన్యాన్ని క్షాళితంచేసే మార్గాలను, ఆలోచనలను- అవ్యక్తవేదనాభరితమయిన లోకానికి ప్రస్ఫుటం చేయగల నారాయణశాస్త్రం కథానిక. అయితే కవిత్వంగూడా దీన్నే తన లక్ష్యంగా ఎన్నుకొన్నదిగదా- అనవచ్చు. ఉన్నతస్థాయి రసహృదయ వేదికపైనే కవిత్వం ముద్రవేయగలదు. కాని కథానిక— సామాన్య పాఠకుడి మేధస్సుకుగూడా సులభ గ్రాహ్యమయ్యే రూపం. ఆంధ్రదేశంలో తెలుగుభాషా పరిధిలో అదొక విశ్వసనీయమయిన చారిత్రక భూమికను నిర్వహిస్తున్నదని నిపుణులు గ్రహించగలరు. అజ్ఞాన, అహంకారపూరిత భూస్వామ్య పుత్రుల కబంధహస్తాల్లో చిక్కి- మానవవిలువలనన్నింటినీ మంటగలిపి, విషసాంస్కృతీ బీజాలను వెదజల్లుతున్న- సినిమాకు సాహిత్యమార్గంలో ఎదురొకని- యివి అబద్ధపు విలువలు- అని నచ్చజెప్పగలిగిన విద్యుత్తధర్మాన్ని నేడు, కథానిక నిరాఘాటంగా చేపట్టింది.

అందుకనే యిది మానవాత్మ సందేశం, మానవసంగీతం. ప్రముఖ విమర్శకులు మధురాంతకం రాజారామ్‌గారు అంటారు. "నాలుగయిదు వందలపేజీల నవల చదివిన తర్వాత అబ్బే యిందులో ఏముంది అనుకోవాల్సిన సందర్భాలు ఎదురవుతుంటాయ్. కాని పదిపేజీల చిన్నకథలోగూడా ఎంత జీవితం చిత్రించాడీ రచయిత అనిపిస్తుంది." అందువల్లనే నవలకన్నా దానిది ప్రముఖపాత్ర.

నా విద్యార్థిదశలో మా అన్నయ్య, రజనీపామీదత్తు "ఇండియా టు డే" వుద్గ్రంధాన్ని చదివి బ్రిటిషు వలస విధానచర్యలు భారతగ్రామీణ జీవనాన్ని ఎంత భ్రష్టుచేశాయో అర్థం చేసుకోమన్నాడు. ఆ గణాంకాలు, శాతాలు నాబుర్రకు పట్టలేదు. అదేకాలంలో మున్షీ ప్రేమ్‌చంద్ "కఫన్" కథావచ్చింది. అది చదివింతర్వాత, రజనీపామీదత్తు పుస్తకాన్ని మళ్ళీ పుటలు తిప్పటం అనవసరం అనిపించింది. జార్ చక్రవర్తులకాలంలో సైనికవిధానం, కట్టుబానిస వ్యవస్థ- ఎన్ని రాజకీయతంత్ర గ్రంథాలను చదివినా బోధపడనివి. టాల్‌స్టాయ్ "విందు తర్వాత"

కథనూ, ఇవాన్‌తుర్గనేవ్ "ముమూ" కథనూ ఒక్కసారి పఠించగానే సుగోచరం కావటం— నా వ్యక్తిగత అనుభవమేగాదు, సమిష్టి అనుభూతి అనుకొంటాను.

కాని కథానికా ప్రక్రియమీద— యింతవరకూ సమగ్ర ప్రామాణిక గ్రంథం వెలువడలేదు. దాని స్వరూపాన్ని అభివర్ణిస్తూ చెదురుమదురుగా కొన్ని వ్యాసాలూ, దాన్ని స్వభావాన్ని నిర్ణయిస్తూ కొన్ని బాలశిక్షలాంటి చిన్నిచిన్ని పొత్తాలూ, ఆంగ్లాంధ్ర హిందీభాషల్లో వచ్చినా, విరాట్‌స్వరూపాన్ని సంపూర్ణ శక్తియుక్తుల్లో పేర్కొనగలిగిన విలక్షణగ్రంథం వెలుగు చూడలేదు. తత్కారణంగానే, పోరంకి వారిది చరిత్రాత్మక సఫలయత్నం అని ఉద్ఘాటిస్తున్నాను. నా ఎరికలో ఏ భాషలోనూ తలపెట్టని ఒక మహత్కార్యాన్ని, తెలుగువారికి సాధించి పెట్టిన దక్షిణామూర్తిగారు అభినందనీయులేగాదు, వందనీయులుగూడా.

అయిదు అధ్యాయాలుగా గ్రంథకర్త విభజించిన యీ గ్రంథంలో, నాలుగొందల పైచిలుకు రిఫరెన్సులున్నవి. ప్రాచ్య, పాశ్చాత్య, ఆంధ్రాంగ్ల సంస్కృత హిందీ భాషలన్నిటి విస్తృత పరిశీలనతో సేకరించబడ్డవి. ఏదీ అనావశ్యకం అనిపించనివి గ్రంథకర్త వ్యక్తిత్వముద్రను స్పష్టంగా కనిపింపజేసేవి. అగ్నిపురాణంనుండి ఆరుద్రవరకూ, బ్రౌను దొరనుండి బంగోరెవరకు, కందుకూరి నుండి కొంతారావువరకు, గురజాడనుండి గుర్తుతెలియని వారివరకూ ఎంతమంది సాంప్రదాయ, ఆధునిక, అత్యంతాధునికుల్ని పరిశీలించారో, ఉపయుక్తమయినవాటినే వుదహరించి, పఠనాశక్తిని పెంపొందించి, సాధారణమైనందిన జర్నలిజంలో జమఅయ్యే కొన్ని విషయాలకుగూడా శాశ్వత సారస్వతస్థాయిని కల్పించారు.

మొదటి రెండధ్యాయాలూ, కాలనుగతమైన పరిణామదశలో కథానిక-మానవ నాగరికత ప్రథమస్పందనం నుండి పొందిన చారిత్రికదశల్నీ, దేశవిదేశాల్లో యీ ప్రక్రియ తులనాత్మక పరిశీలననూ విశదీకరించేవైనా, అవి పి. హెచ్.డి సిద్ధాంత వ్యాసంకోసం నింపిన పుటలు, పేరాలుమాత్రంకావు. ఇవి "గాక మూడు అధ్యా

యాలకు పరిపుష్టిని చేకూర్చిన ఆముఖాలు, అభరణాలు. ఆధునిక పాశ్చాత్య కథానికా లక్షణాలు——అనేక శతాబ్దాలకు పూర్వమే భారతీయలాక్షణికులు నిర్దేశించారన్న సత్యాన్ని, పోరంకివారు ఎంత ప్రామాణికంగా, ప్రతిభావంతంగా ప్రూవ్ చేసినా, "అన్నీ మన వేదాల్లోనే వున్నాయష" అని భారతీయ ప్రాచీనత నంతా బంకమ్ చేసి అత్యంతాధునిక రేషనలిష్టులమని తొడలు చరచుకొనే కొందరు అజ్ఞానులు తప్పు పట్టకపోరేమో! నష్టం మాత్రం లేదు.

కాని యీ గ్రంధం ఆయువుపట్టు మాత్రం- చివరి మూడు అధ్యాయాలే. అవి కథానిక- స్వరూపనిరూపణ, స్వభావ పరిశీలన, సమాజం. సమకాలీన రచయితలకు, కులవిమర్శకులు కానివారికీ, సాహిత్యంలో కథానిక సృష్టికోసం తహతహలాడుతూ సరైన అవగాహనలేక సంధ్యలో, చీకట్లో మార్గాలు వెతుకుతున్న వారికి శాస్త్రీయ సైద్ధాంతిక దిశాదర్శనం చేయించే విస్తృతపరిచయాలు- యీ అధ్యాయాలు.

ఆంధ్ర జాతీయ పునరుజ్జీవన దశకంనుండి సమకాలంవరకూ వెలువడిన అనేక ప్రసిద్ధ, విశిష్టకథల్లో వస్తువునూ, సన్నివేశాల్నీ, పాత్రచిత్రణాన్నీ, రసపోషణనూ, భాషాలంకారాలను, వుద్ఘాటించి విశ్లేషించి, పోరంకివారుతీర్చి సులువు చేసిన అనుమానాలు కథకులందరికీ కమనీయమార్గాలు, కథానికపరిధిలో ఒక్కొక్క శైలినీ, రచనారుచినీ ఎత్తిచూపి, సూక్ష్మాతిసూక్ష్మమైన అసంఖ్యాకవ్యాఖ్యానాలను సంయమనంతో చేర్చి, గ్రంథప్రాముఖ్యాన్ని చాటిచెప్పారు.

సంయమన సంకలన, సంస్కారయుత సంపాదకత్వం, స్వయంప్రతిభాయుత సమీక్ష యీ సుగుణత్రయాన్ని యీ గ్రంథంలో ప్రతిభావంతంగా నిర్వహించారు. కథానిక అందమైన స్వప్నమొక్కటేగాదు, సామాజిక యాత్రాగతిలో వుద్వేగపూరితమైన సత్యశోధన అని, అన్ని స్కూల్స్ ఆఫ్ థాట్స్‌ను గురించిన సముచితసారాంశాన్ని ప్రతిఅధ్యాయం చివర సంధించారు. అందువల్ల యిది నిష్పక్షపాత శరపరంపర.

అయితే ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులోరచనచేసిన కొందరు రొమాంటిష్టుల్ని ఎక్కువగా ఉదహరించినా, శ్రీపాదవారినుండి శ్రీకారం చుట్టిచుట్టూ తిరిగి నేటివరకూ పయనించిన ప్రయత్నంలో కొన్ని విశిష్టకథకుల్ని విస్మరించినా, అది వుద్దేశపూర్వకంకాదని నిర్ద్వరంగా చెప్పవచ్చు.

వివిధ భాషాసాహిత్యాల్లో పరిశీలన చేసినపుడు 6వ శతాబ్దపు రష్యన్‌రచయితలు, కథానికరూపాన్ని హిమోన్నతపరిధికి చేర్చినారు. ఒక్క ఆంగ్లభాషారచయితలే ప్రచారంలోవున్న భారత దేశంలో, రష్యన్ మాష్టర్ల ప్రజ్ఞ యిప్పుడిప్పుడే బయటకు వస్తున్నది. పోరంకివారు వారిలో కొందర్ని ఛాయామాత్రంగా, తులనాత్మక పరిశీలనలో వుదాహరించారు. ఉదాహరణకు చెహోల్, గొగోల్, టాల్‌స్టాయ్. కాని సమగ్రవ్యాసానికి అర్హులైన పుష్కిన్, తుర్గనేవ్, కుప్రిన్ యిత్యాదుల మణిపూసలనుండి కథకుల్ని పాఠకుల దృష్టికి తెచ్చివుంటే గ్రంథ విస్తరణ జరిగినా, సాహిత్యన్యాయం కూర్చివుండేది. ఇది చిన్నలోపమేమో అనిపిస్తుంది.

ముద్రారాక్షసుడు ఏమాత్రమూ స్వైరవిహారంచేయని చక్కని ముద్రణ గురించి చెప్పవలసిందే యీ గ్రంథం, ప్రతి గ్రంథాలయంలోను మాత్రమేగాదు, ప్రతి కాలేజీ విశ్వవిద్యాలయాల్లోనే గాదు, ప్రతి సారస్వతప్రియుడూ సేకరించవలసినది. [illegible] ప్రతి చిన్న పెద్దకథకుడూ పఠించవలసింది. [illegible] యీ రచన, రానున్న కొద్ది సంవత్సరాల్లో ఆధునిక సాహిత్యక ప్రక్రియ [illegible] ప్రవేశపెడుతున్న విశ్వవిద్యాలయాలు, నిర్బంధ పాఠ్యగ్రంథంగా చేర్చవలసిన యీ వుత్తమగ్రంథం రచయితను, తెలుగు ఎకాడమీ పురస్కృత చేసివుండకపోతే, ఏదో కాలేజీలో కుర్రలెక్చరర్‌లే, కొన్ని మంచి కథలు వ్రాసినవాడు అనుకొనే ప్రమాదంలో పడిపోగలరు. వయసు వెలికిరానీయని పరిపక్వమైన ఆకారం, విద్యాసంస్కారం యిచ్చిన వినయం, వచ్చిన వారిని క్షణంలోనే మోహితుల్నిచేసే చిరునవ్వు, కాని మాటల్లో దింపితేగాని మనసులోని లోతుల్ని చూడనివ్వ నిగర్వి, ఆయన పుస్తకంగూడా అంతే. ఆసాంతం చదివినప్పుడే అది విజ్ఞానఖజానా అని గ్రహించలేరు.

చివరిమాట : గ్రంథ మూల్యం : రు. 120/- సామాన్యులకు అంద దేమోగాని దాన్ని కుదించటం ఆయనకూ సాధ్యంకాలేదు, యీనాటి పరిస్థితుల్లో.

ప్రతులు- విశాలాంధ్రలోనూ, నవోదయలోనూ, ఇంటినెంబరు 1-100 చైతన్యపురి, హైదరాబాదు-500 660లోనూ లభిస్తాయి.

చదవండి, చదివించండి. ఇది కథానికోపనిషత్ ।

.... o ....

మాటకచ్చేరి

-గోళ్ళమూడి నళినీమోహన్

చేయి తిరిగిన రచయిత, పాత్రికేయుడు, ఆకాశవాణి హైదరాబాదు కేంద్ర కుటుంబీకుడు, స్వర్గీయ తురగా కృష్ణమోహన్‌రావు గారి హాస్య రచనల సంకలనమే ఇది సీరియస్ రచనలకంటె హాస్యరచనలు చేసి చదువరులను అలరించడమే కష్టతర-మని అనుకోవచ్చునేమో. హాస్యరచనలు ఎన్నో, మరెన్నో పురుషులందు పుణ్య-పురుషులు వేరయా అన్నట్లుగా వెగటు,జుగుప్స కల్గించకుండా .హాయిగా మనసార నవ్వుకోడానికి అనువైనవి పై మెట్టుకు చెందుతాయి ఇలాటి హాస్యరచనలు చేయ-టంలో దిట్ట తురగావారు.

మరోమాట

హాస్యభరితమైన రచనలు సాగించటంతోబాటు చతురసంభాషణలు కూడా జరుపగల నేర్పు ఏకొద్దిమందికోగాని అబ్బదు. అలాటి కొద్ధిమందిలో కృష్ణమో-హనరావుగారొకరు. వెనకటికి ఒకసారి, శ్రీనివాస శిరోమణిగారికీ, చలంగారికీ కూడా పరిచయం ఉన్నవారొకరు శిరోమణిగారితో, చూడు శిరోమణి,నువ్వు మా-ట్లాడ గలిగినంత చక్కగా రాయగల్గినా, చలం రాసినంత రమ్యంగా మాట్లాడగ-

లిగినా ఎంతబాగుండు అన్నారట తురగావారు మాత్రం అందునా ఇందునా కూడా సమాన ప్రతిభ సంతరించుకున్నారు. ఈ దృష్ట్యా, ఈ పుస్తకానికి 'మాటకచ్చేరీ' అన్న పేరు ఎంతో సముచితం కాగలదు.

సంకలనంలోని రచనలన్నీ లోగడ పత్రికా ముఖంగా పాఠకలోకానికి పరిచయమైనవే. రాజధాని కబుర్లు అన్న శీర్షిక క్రింద ఉన్న ఖ్యమాలు కాక మరో ఇరవై రచనలు ఈ సంకలనంలో చోటుచేసుకున్నాయి. వీటిలోని పాత్రలు ఎంతో సజీవమైనవి. సన్నివేశాలు సైతం, నిత్యజీవితంలో మనకు తారసపడుతూ ఉండేవే. ఐతే, కృష్ణమోహనరావుగారు ఒక మంచి మాటల శిల్పి కావటంచేత అతి మామూలు అనిపించే వ్యక్తుల పరంగానూ, అతి సాధారణ సంగటనల ద్వారానూ మనకు చాల చక్కటి హాస్యాన్ని అందించారు.

'ఆలస్యమే అమృతం' అన్న రచన, 'సహజంగా ఆలస్యపంతుడైన' సుబ్బయలీ అనే ఒక పాత్ర ఆలంబనంగాసాగింది. కొండొకచో ఆలస్యం జరగటమే ప్రయోజనకరమవుతుంది అని ఎంతోచమత్కారంగా చెబుతారు రచయిత ఈ రచనలో.

రకరకాల చందాల సేకరణద్వారా సమాజాన్ని వంచించి పొట్టలు నింపుకునే ఆషాఢభూతుల లీలలను మనం "సంఘసేవ చేస్తాం 'చందలిస్తారా" అన్నరచనలో చూస్తాము. అసలు ఈ రచన ఎత్తుగడే ఎంత గమ్మత్తుగా ఉందో చూడండి. "మన దేశంలో చాలామందికి ముష్టెత్తడం అలవాటే. కొందరు దేశంకోసం, మరికొందరు సంఘంకోసం ముష్టెత్తుతారు."

చదువరులను మురిపించే మరోరచన "చీపురోదంతలు". అసలు చీపుళ్ళు ఎన్నెన్ని రకాలవి, ఏయే జాతివి మార్కెట్లో లభిస్తున్నాయా అన్న వివరణతో ప్రారంభించి, ఇల్లాలు సేకరించిపెట్టిన చీపురుకట్టలు అడుగడుగునా అడ్డుతగులుతూ ఉంటే, అత్యవసరమైన పంచెలు, చొక్కాలువంటి వాటిని వెతుక్కోవడంలో నానా అవస్థలపాలైన గృహమేధి కథ ఇది. దీనిలోని వాక్యాలుకొన్ని ఎంత గమ్మత్తుగా ఉన్నాయో చూడండి. "చీపుళ్ల కొన్ని బల్లక్రింద ఉన్నమట్టిని రేడియో కిందికీ, రేడియో క్రింద మట్టిని మంచం కిందకీ పంచాయతీరాజ్ మేష్టర్లని బదిలీ

చేసినట్లు బదిలీ చేస్తాయట." "....వెంటనే భూమి దద్దరిల్లేటట్లు మా ఆవిడ్ని పిలిచాను. మాది మేడమీద పోర్షను.... సులభంగా దద్దరిల్లుతుంది. "ఇదిగో చూడు, ఇది ఇల్లో, చీపురుపుల్లో సాయంత్రంలోగా తేల్చాలి.

ఇక ఇళ్ళు కూల్చడంలోనూ, పెళ్ళిళ్ళను చెడగొట్టడంలోనూ అపరిమితానందాన్ని పొందే పేరయ్య అనే ఉలిపికట్టె వక్రబుద్ధినీ, సాధించిన విజయాలనూ చిత్రించే రచన "ఇల్లుకూల్చి చూడు". మళ్ళీమళ్ళీ చదివి నవ్వుకోవాలనిపించే వాక్యాలు దీనిలో కొల్లలు, మచ్చుకి, మాకు తెలుసున్నంతవరకు క్రీస్తు పుట్టక పూర్వంనుంచి ఉన్నాడు పేరయ్య, పెళ్ళిళ్లు పడగొడుతూనె ఉన్నాడు. ఇళ్ళుకూలుస్తూనే ఉన్నాడు. అసలు పేరయ్యకి పూర్వజన్మ అనేది ఉంటే, అందులో ఆయన పురపాలకసంఘంలో పనిచేసి ఉండేవారని మా ఊళ్లోవాళ్ళ అభిప్రాయం.

తుమ్ముల్లో రకాలు, అవిచేసే చిత్రవిచిత్ర ధ్వనులు, తుమ్ములను గురించిన నమ్మకాలు, ఇలా ఎన్నో అంశాలను బహురమ్యంగా వర్ణించిన రచన "తుమ్మెదా ఒకసారి", ఒకానొక పాట ఎత్తుగడలోగల "తుమ్మెదా" అన్నపదాన్ని తుమ్ము+దాం అనే అర్థంతో కావాలని వాడుకుని, దానికి చిలవలు పలవలుచేర్చి బహురమ్యమయిన కృతిలో ఈ రచన సాగించారు తురగావారు. ఇంటిల్లిపాదీ మళ్ళీమళ్ళీ చదువుకుని మనసారా నవ్వుకునే హాస్యరసగుళిక ఈ రచన.

ఈ సంకలనంలో మిగిలిన రచనలుకూడా, పాఠకులను పుస్తకం కిందపెట్టకుండా చివరిదాకా చదివించగలవే.

144 పేజీలున్న ఈ పుస్తకం ప్రచురణకర్తలు "ప్రత్యూష ప్రచురణలు, హైదరాబాదు." మూల్యం 25 రూపాయలు. కాపీలు కావలసినవారు, ప్రత్యూష ప్రచురణలు, 3-4-864 1, బర్కత్‌పుర, హైదరాబాదు నుంచిగానీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన భవన్, బ్యాంకుస్ట్రీట్, హైదరాబాదు నుంచిగానీ పొందవచ్చు.

కృష్ణమోహనరావుగారి రూపాన్ని కళ్ళకు కట్టేటంత సహజంగా "బాపు" వేసిన ముఖచిత్రంతో, ఆనంద్ గీచిన వ్యంగ్యరేఖా చిత్రాలతో ఎంతో చూడ

ముచ్చటగా ఉంది ఈ పుస్తకం, "మూడుదశాబ్దాల క్రితం, ఆయన (కృష్ణమోహన రావు) నవ్వుల పందిరిక్రింద కూర్చుని కాలాన్ని మరిచిన" శ్రీ వాకాటి పాండురంగారావు రాసిన ముందుమాట, పుస్తకానికి ఒక ఆకర్షణ. అత్యంత స్నేహశీలి అయిన తురగావారి ధర్మపత్ని జానకీరాణిగారు, ఈ సంకలనాన్ని వెలువరించడంలో సహకరించిన యావన్మందికీ ధన్యవాదాలర్పించారు "విప్లవశృతిలో." ❋

పల్లవి

— సి. వి. కృష్ణారావు

[పల్లవి (కవితాసంపుటి) రచయిత : శ్రీ శశిశ్రీ — మిత్రసాహితి
కడప - వెల రూ. 10లు - పేజీలు 69]

ఇందులో 58 గేయాలున్నాయి. రచయిత నేటిసమాజ సమస్యలకు ఉద్రిక్తతకు స్పందించి రాశారు. ఈ సంపుటిలో "ఫలించిబోయే స్వప్నం", "ఆరాత్రి", "మినీ కవిత", "కాష్టలిజం", ఎన్నోదీపాలు", "ఆకాశంలో నిరాశామేఘాలు" మకుటంగాగల గేయాలు బాగు న్నాయి. శశిశ్రీ గేయాల్లో మంచి వైవిధ్యముంది. సౌందరనందమునుండి గోడీర్షియాదాకా ఆయన ఊహాపరిధిలో ప్రయాణంచేశారు.

"పేదసాదల చెమట బిందువులు" సింధులై మిమ్ముముంచేస్తుంది అన్న భావనా వృత్తమే అన్నిట్లోవుంది. అందుకని ప్రతికణంఆయత్తం కావాలని, రేపటి సూర్యునికి ప్రతీక అయిన ఏదోమార్పుతేవాలనివుంది.

శశిశ్రీగారు కొన్నిచోట్ల భాగా రాశారు. ఈరాత్రిక్కు రాబోయేకాలంలో కాబోయే "రామెటిరియల్సు" (అతిరహస్యం), నీటిపంపు కన్నీట్నంతా ఓర్మికి మారుపేరైన భారతభూమిదిగమింగి........ (కుంతిభారతం)

రాత్రి అనేభావచిత్రణ ఆరాత్రి, "అతిరహస్యం", బట్టబయలు, స్వాతంత్ర్యం, "తేజా" అన్న గేయాల్లో వుంది. అలా పునరుక్తికి కావటంలో చదువరి కొద్దిలో [illegible]స్తాడు. శశిశ్రీ ద్వితీయసంకలనం వెలుగులోకి రావటానికి ఈ సంకలనం ఆకర్షిస్తున్నది. ❋

"మహోదయం" కవితా సంకలనం

— టి. కృష్ణమూర్తి యాదవ్

"మహోదయం" బూరభిక్షపతిగారు రాసిన వచన కవితా సంకలనం. సంకలనం లోని కవితలు చాలమట్టుకు గ్రామీణప్రజల జీవితంమీద రచించినవే పుస్తకం చదువుతున్నంత సేపు పల్లెజీవనం దృష్టిపథంలో కన్పడుతుంది.

పసికందుల విరిగిన రెక్కలు
కందెనలో అరిగిన ముక్కలు
గుడి వెలుగుల చూడని పువ్వులు
వారు బడిచదువుల నెరగని మువ్వలు

పట్టణవాసులకు గ్రామీణ జీవితం గూర్చి చాల తక్కువగా తెలుసు. పల్లెలలో హరిజనులు ఊరి చివరన జీవిస్తారు. అంటరాని వారుగా చూడబడుతారు. వీరే పొలాలలో ఎక్కువగా పని చేస్తూ ఉంటారు, వీరిలో చాలమంది చదువు సంధ్యలు లేని బడుగుజీవులు. వీరి పిల్లలే ఎక్కువగా వ్యవసాయ కూలీలుగా బాలకార్మికులుగా ఉంటారు. ఊర్లల్లో హరిజనులను, గుడులల్లోనికి బడుల్లోనికి రానిచ్చే వారుకాదు, ఇప్పటికి కొన్నిగ్రామాల్లో ఇది మిగిలి ఉందంటే అతిశయోక్తి కాదు. బూరభిక్షపతిగారు రాసిన పైపంక్తులు వాళ్ళిదృష్టిలో పెట్టుకొనిరాసినవే. ఎంతచక్కగా చెప్పారు.

దేశంలోని అవినీతిని, అశ్రితపక్షపాతాన్ని, ఆఫీసుల్లోనిపనులు పైసలు, పైరవీలు లేనిది పైళ్ళకు కాళ్ళురావన్న సంగతిని తనకవితలు' పీజులరోజులు", "చిత్రమైన వియ్యంకుల్లో"చూపెట్టారు.

భూసామ్య వ్యవస్థశిథిలమై, ధనికసామ్యవ్యవస్థ రూపుదిద్దుకొని బల పడుతున్న రోజుల్లో మనమున్నాము. బూరభిక్షపతిగారు భావ్యాతాయుతమైన కవిగా సమాజంలోని అన్యాయాలనుచూసి, అవకతవకల్నిచూసి స్పందించారు. ప్రపంచంలో రెండే రెండు కులాలు అవి (1) మెరిసే ధనికత్వం (2) మాసినబీదత్వం.

కవి శ్రామికజనావళికి జరిగిన అన్యాయాల్ని తన కవితల్లో చాల చోట్ల పొందుపరిచాడు. ఎంతశ్రమించినా కడుపునిండని కార్మికులను గురించి పొలాల్లో శ్రమించి ధాన్యం పండించిన కడుపులునిండని బక్క రైతులను గురించి ఇలావాపోతాడు.

దరిద్రుడు, నిర్భాగ్యుడు
నిత్యక్షోభి కార్మికుడు,
ధరణికంతా వడ్డించ
ఖాళీకుండ జీవితంలో
కడుపుగాలే కర్షకుడు,

నిజంగా ఆలోచిస్తే గ్రామీణ జీవణ వ్యవస్థ కొద్ధి మంది భూస్వాములచేతుల్లో ఉంది. ఇప్పటికినీ పల్లెలోజీవనోపాదిలేక పట్నవాసాలకు తరలివస్తున్నారు. భూస్వాములు చేనుల్లో పనిచేసే గ్రామీణ శ్రామికజనులకు కష్టానికి తగినఫలితం పొందటంలేదని, వారికి వ్యశ్రమే సొత్తు అవుతుందని చెపుతాడు.

రెక్కాడితే
డొక్కాడదని వారికి
పగలేమి, రేయేమి
కార్మికులకు పరిశ్రమే వారి సొత్తు. కల్లు, సారాయిలకు

అలవాటుపడిన కార్మికుల సంసారాలు ఎలా కృంగిపోతున్నాయో గుర్తించి, వారికి తాగుడు మానాలని తన కవితలద్వారా హితబోధ చేస్తాడు.

మనదేశం ప్రపంచంలోకెల్ల పెద్ద ప్రజాస్వామ్యదేశం. వివిధమతాలకు, వివిధ భాషలకు నిలయం. అప్పుడప్పుడు మతమౌఢ్యం' భాషాతత్వం, ప్రాంతీయ తత్వంవల్ల, బొంబె, థానే, భివాండిలో భాగ్యనగరం, మీరట్, ఆలిగర్ ప్రదేశాలలో జర్గిన అల్లర్లు బారభిక్షపతిగారి దృష్టి నుండి తప్పించుకుని పోలేదు. "దేశమా ! ఎటు నీ పయనం" "మతం మంటలు" అను కవితల్లో మతాల ముసుగులో మారణహోమాలు జరిగాయికాబట్టి మతం ముసుగును తీసివేయమంటాడు. మతం ఏదైనా మానవులందరూ మానవతావాదంతో సమైఖ్యంగా జీవనం గడపా

లంటారు. "ప్రజాస్వాహ - మ్యాంమ్యాం" కవితలో రాజకీయనాయకుల లగ్జరీ జీవితాల గురించి దేశాన్ని ఎలా దోచుకుంటున్నారో చిత్రించారు "నేటిగురువు" కవితలో దేశానికి చైతన్యదీప్తి, యువతకు దారితెన్నులు, మనిషిలో సమతాభావ స్ఫూర్తి జాతికి సమైక్యతాశక్తినిచ్చె గురూజీ కావలంటాడు.

మనదేశం ప్రపంచంలో అతి పెద్దజనాభాకి రెండవదేశం. ఈ దేశంలో ఇంజనీర్లకు, డాక్టర్లకు, పట్టభద్రులకు కొదవలేదు. ఉద్యోగాల్లేక విదేశాలకు ధనార్జన నిమిత్తం వలసపోతున్నారు.

బూరభిక్షపతిగారు
నిరక్షర్యాసత
గంగా మైదానం
నిరుద్యోగం

థార్ ఎడార్లి"లా ఉందంటారు వాస్తవంగా నిరక్షరాస్యత గ్రామాలలో కొట్టుమిట్టాడుతోంది. ఉద్యోగాలు దొరికే అవకాశం చాల తక్కువగా ఉంది. చాలమంది నిరుద్యోగులు నిరాశ నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్నారు. భిక్షపతిగారు నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎంతో తీవ్రసమస్యగా తన కవితలో పాఠకలోకపు దృష్టికి తెస్తున్నారు.

భిక్షపతిగారు విషయాన్ని ఎన్నుకోవడంలో దూరదృష్టి కనపరిచారు. కానీ శిల్పం చెక్కడంలో చాల కవితల్లో పనితనం కనిపించలేదు. "మహోదయానికి" పూజ్యులు కాళోజిగారు నా గొడవ రాశారు భిక్షపతిగారు చేసిన పొరపాట్లను నిర్మొగమాటంగా చెప్పారు. "మహోదయం" కవితాసంకలనాన్ని యువలోకం ఒకసారి చదవచ్చు.

ముఖచిత్ర దృశ్యం చాలా బాగుంది. ప్రస్వాజి బొమ్మను చక్కంగ గీసిచ్చారు. భిక్షపతిగారి తొలి కవితాసంకలనం ఇంకా వీరి కలంనుండి గళంనుండి మంచికవితలు మంచి కవితాసంకలనాలు తెలుగు వాఙ్మయానికి అందిస్తారని ఆశిస్తున్నాను.

....o....

రష్యన్ కథ :

అదృష్టం

మూలం : కాన్స్టాన్టిన్ పౌస్తొవ్స్కి

అనువాదం : కె. సుబ్రహ్మణ్యం

క్రితం వేసంగిలో బొరోవాయ్ జలాశయం తగిలేచోట్లో కాలిదారిన ప్రక్క గ్రామానికి వెళ్ళాను. అది అడవిప్రాంతం ఎటు చూసినా దేవదారు చెట్లు కనిపిస్తుంటాయి. చెట్లమధ్యనుంచి దారి. ఖాళీస్థలాల్లో ఏపుగా పెరిగిన గడ్డిమొక్కలు. వాటి మధ్య అక్కడక్కడా పూలమొక్కలు లేకపోలేదు. ఆ ప్రకృతి వాతావరణంలో అలుపు తెలియకుండా నడకసాగించాను.

దారి చిట్టచివరన ఓప్రక్క బాటసారివంక తొంగి చూస్తున్నట్టు నన్నలరించిన బ్లూబెల్స్ వంటివే పుష్పాలు కనిపించాయ్. పరీక్షగా చూస్తే- అవినేనెరగని కొత్తరకం పూలని కనుగొన్నాను. ఓ పూల గుత్తి కోసుకున్నాను. దళాలు పెళుసు! జాగ్రత్తగా అటు-ఇటు కదిపాను. ఆశ్చర్యం!- లోపలి ఎండు విత్తులు గలల్లాడుతూ వింత చప్పుళ్ళు సృష్టించాయ్.

పొలాలగుండా దారి. దాటితే ఊరు. నా ఆలోచనలో నేనున్నాను. ఇంతలో పకపకనవ్వులు నాదగ్గర్లో వినిపించాయి, తేరుకున్నాను. ఇద్దరు పల్లెపడుచులు నాకెదురయ్యారు. వాళ్ల భుజాలకి మట్టికొట్టుకుపోయిన జోళ్లలేసులతోకట్టుకున్నారు. ఎండకి ఎర్రబారి కెంపుల్లావున్నాయి వారివదనాలు. నా దృష్టిపడగానే గాలికిచెదురుముదురైన ముంగుళ్ళని సరిచేసుకుని స్తబ్ధులైపోయ్యారు. నాలో ఏంచూశారో! అలానే నా ప్రక్కనుండి వెళ్ళారు. గిరుక్కున వెనుదిరిగాను. అదేక్షణంలోవారూఆగి వెనక్కితిరిగి నావంక దృక్కులుసారించి, సిగ్గుపడిపోయినట్టుఒకసారిగా తలలువాల్చేశారు అయినా వారి ముఖాల్లో మందహాసం చిందుతోనే వుంది.

ముక్తకంఠంతో నాకు 'థాంక్స్' కూడ చెప్పారు,

ఇదోహటా?!

"ఎందుకో చెబుతారా?" అడిగాను అవాక్కయిపోతూ.

"పూలగుచ్ఛంతో మాకు ఎదురైనందుకు!" అంది ఓపడుచు.

నాసందేహం తీర్చుకునేలోగా అక్కడ ఆగక నడకసాగించారు. కొద్దిదూరంలో గిరుక్కున నాకేసి తిరిగి-' థాంక్స్!-థాంక్స్!" చెబుతూ వారిదారిన వెళ్ళారు. సందిగ్ధంలో మునిగిపొయ్యాను. ఆట పట్టిస్తున్నారా? అన్న అనుమానంవేసింది. పొలాలు దాటి ఊరులోఅడుగుపెట్టాను. ఓవృద్ధురాలు త్రాడుకట్టిన ఓమేకని తోలుకు పోతూ నాకు ఎదురైంది. ఆ వళాన త్రాటినివదిలేసి ఒక్కపెట్టున రెండుచేతులూ పైకెత్తి-

"నువ్వు ఎదురుపడటం నా అదృష్టమే బాబూ! నీకు నా కృతజ్ఞతలు!" అంటూ వెళ్ళబోయింది.

బిత్తరపోయాను.... నాలో ఏం చూసింది? దేనికో కారణంచెప్పి పుణ్యం కట్టుకోమన్నాను.

"చెప్పకూడదు. అదృష్టదేవత మాయమవుతుంది! నీదారిన నాబోటివాళ్ళు ఎదురుపడితే వారికీ అదృష్టం పంచుతూ సంపాదిగా వెళ్ళు నాయనా!" -కోరిందావిడ.

ఆ అయోమయస్థితిలోంచి చివరికి వచ్చిన పనిమీద గ్రామపెద్దను కలుసుకున్నాను, నా దారంట జరిగిన విడ్డూరానికి తగిన కారణమేమిటో ఆయన్నే అడిగాను.

ఒక్కమాటున పెళ్లున నవ్వారు.

"అదంతా మీచేతిలోని పూలమహిమే; ఇది అదృష్టపుష్పాలు. వీటి గురించి తెలియని మీబోటి ఆగంతకులెవరైనా ఆకస్మాత్తుగా మా వూరివాళ్ళకు ఎదురొస్తే ఆ అదృష్టం వాళ్ళకేనని ఈ ప్రాంతంలో ఓ మూఢనమ్మకం వుంది. ముఖ్యంగా పెళ్ళికాని పడుచులకు వారు కోరుకున్న వరులే వస్తారట. వృద్ధులకు సుఖశాంతులు చేకూరుస్తాయి ఈ పూలు. అంతెందుకు? మీరాక నాకూ శుభ

ప్రదం : రీజెనల్ సెంటర్ నుండి మా గ్రామానికి నేను చేపట్టిన మెయినురోడ్డు స్కీము ఈ సంవత్సరాంతంలోగా ముగియాలి. జరిగే తీరుతుంది! ఆ-అన్నట్టు ఈ ప్రాంతంలో ఓం ప్రథమంగా మొక్క-జొన్న పంట పండించబోతున్నాం. చేల గట్లలో రకరకాల కూరగాయలూ సమృద్ధిగానే పండుతున్నాయి. ఆ లోటు మాకు తీరిపోయింది మీకు మొదట ఎదురు డ్డ ఆ అమ్మాయిల కృషివల్ల ఇది సాధ్యమైంది. ఇద్దరూ ఇంకా అవివాహితలే !"

....o....

శాలపుంజ — అరుదైన కథలకు - అపురూపవేదిక

అభివృద్ధి

- కొడవగంటి కృష్ణమూర్తి

వూరు ఇప్పుడిలా వుంది కాని ఒకప్పుడు ఎలా వుండేదో చాలామందికి తెలియదు. నేను ఎంతోమందిని అడిగాను. ఎంతమందో ఎన్నో విషయాలు చెప్పారుకాని, నాకేవిధమైన తృప్తి కలక్కపోవడంచేత నా ప్రయత్నం విషయమై మరింత శ్రద్ధ వహించాల్సి వచ్చింది. నా ప్రయత్నాలన్నీ నన్ను నేరుగా యానాది చిన్నపోలాయి దగ్గరికి తీసుకునిపోయినై. తాతలకాలం నాటినించీ వాళ్ళూ వూళ్ళోనే నివసిస్తున్నారు. నాకు తెలిసిన విషయాలకు నాడి ప్రకరణంకూడాచేరిస్తే సర్వం విదితం అవుతుందని నాకు గట్టి నమ్మకం కలిగింది.

నిజానికి చిన్నపోలాయి నాకు కొత్తవాడుకకపోయినా వడిల్లు కనుక్కొని చేరేటప్పటికి చాలాకష్టం అయింది. మేము ఈ చివర వాడు ఆచివరనాయె! వాడు

రోజు ఇంతదూరంనించీ పెద్ద చిదంబరంగారింటికి పనిపాటలకు వస్తాడు. కాయ తుడుస్తుండగా, పిల్లల్ని అడిస్తుండగా ఎన్నోసార్లు చూశాను. కాని నాకు కావలిసిన విషయం వాడివల్లనే తెలుస్తుందని వూహించుకోలేకపోయినాను. వాడిని అడుగు దామని అనుకుంటుండగా రెండు మూడు రోజుల్నుంచి కనిపించనేలేదు. అందు వల్ల నేనే వాడింటికి వెళ్ళక తప్పలేదు.

ఒకప్పుడు పెద్దపోలాయి (చిన్నపోలాయి తాత) కుటుంబం గుడిసెలు వున్న చోట ప్రస్తుతం మిషనరీ బంగాళావుంది. ఆ రోజుల్లో ప్రస్తుతం మా వూళ్లో రాజ వీధిగా పరిగణింపబడే సిమెంటురోడ్డులో వుండే కొద్దికొంపలూ, వాటినానుకుని అటూఇటూ కొన్ని పూరిళ్ళు కలిసి మొత్తం వూరుగా వుండేది. కొద్దిదూరంలో దిబ్బమీద పెద్దపోలాయీ, తదితర ఎలికల యానాది గుడిసెలూ వుండేవి. ఇంకా అవతల కొంతదూరంలో మాలకొంపలుండేవి. పెద్దబజారులో మాత్రం రెండు కోమట్ల ఇళ్లుండేవి. ముందు వసారాలలోనే వాళ్ళు అవీ ఇవీ తెచ్చి చిల్లర వ్యాపా రం చేస్తూవుండేవారు.

మొదట మా వూళ్లో బియ్యం మర ఏర్పాటు చేయించింది. చిన్నచిదంబ రంగారు (పెద్దచిదంబరంతాత), దాంతో మరబియ్యం ఎక్కడినుంచో బళ్ళమీద అవస్తపడుతూ తెచ్చుకోవలసిన అవసరంలేకుండా పోయింది, పెద్దపోలాయికి చిన్నచిదంబరంగారి బియ్యంమరలో కూలీ దొరికింది పెద్దపోలాయి హోదా తది తర యానాదివాళ్ళకు గుర్రుగావుంటే, బియ్యం మర వ్యాపారంచేస్తే కోమట్లకి మరింత గుర్రు కలిగించింది. కారణం వాళ్లు ఇదివరకు మాదిరిగా మరబియ్యం అమ్మటానికి వీలులేకుండాపోయింది. ఎవళ్ళకు బియ్యం కావలిసినా బస్తాధాన్యం మరదగ్గరికి తీసుకపోవటమూ, బియ్యం చేయించుకోవటమూ జరిగేది. ఆ కారణంగా చాకిరీచేసే యానాదివాళ్ళలో పెద్దపోలాయికీ, వ్యాపారంలో చిన్నచిదంబరంకూ అవినాభావ సంబంధం ఏర్పడింది.

మెలుమారంలో రైలుమార్గం ఏర్పాటుకావటం చెప్పుకోతగిన సంఘటనలలో మొదటిది. మావూరినుంచి వెళ్ళేడొంకా, రైలుమార్గమూ కలిసినచోట చిన్నరైలు

స్టేషనుకూడ నిర్మించారు. అక్కడ మొదటిసారి రైలు ఆగినప్పుడు మా వూళ్లో జనం కొబ్బరికాయలు తీసికెళ్ళి కొట్టారు. ఏ ఆకారంలోఉన్నా అది శక్తిస్వరూపిణి! అదివరకు డొంకలావున్నది ఒకవిధమైనరోడ్డుగామారింది. రైలుమార్గంలో ఈ రోడ్డుకు అటూ ఇటూ పూరిగుడిసెలు ఏర్పాటయి కొన్ని చల్లర దుకాణాలుకూడా స్థాపించబడినై, అదే తర్వాత రైలుపేటగా మారింది.

మావూళ్ళో తర్వాత పంచాయతీబోర్డు ఏర్పడి బురదగా, రొచ్చుగావుండే రోడ్లు కంకరరోడ్లుగా మారినై. ఇప్పుడు గాంధీచౌకుగావున్న ఆవరణమధ్య ఆ రోజుల్లో మూడుదీపాల స్తంభం ఒకటివుండేది. సాయంత్రం అది వెలిగించే సమయంలో జనంచేరి చూచేవాళ్లు పిదప వూరినుంచి రైలుస్టేషనుకుకూడా కంకర రోడ్డు పడడంచేతనూ, జనసౌకర్యం, సౌఖ్యం తప్పనిసరికావడంచేతనూ వూళ్లో నుంచి స్టేషనుకు గుర్రబ్బళ్ళు తయారయినై. ఈ గుర్రబ్బళ్లు తోలేవాళ్ళు ఎక్కువగా సాయిబులు. వీళ్ళు ఎక్కువగా రైలుస్టేషను ప్రాంతాల గుడిసెలలో వుండేవాళ్ళు. కొంచెం డబ్బువున్న ఒక సాయిబుమాత్రం గాంధిచౌకులో ఒకకొట్టులో సోడా ఫ్యాక్టరీ స్థాపించాడు. రాత్రిపూట పెట్రోమాక్సు లైటుకాంతిలో ఆ సోడా సీసాలు రంగురంగు నీళ్ళతో చూడటానికి ముచ్చటగా వుండేవి. కొట్టుముందు వూడ్చి నీళ్లు చల్లించేవాడు. దాహం ఎక్కువైన పెద్దమనుష్యుల విశ్రాంతికొరకై రెండు చిన్నబెంచీలు అటూ ఇటూ ఏర్పాటుచేశాడు. నేత్రానందకరంగా వుండటానికి నాలుగయిదు క్రోటన్సు తొట్లు పెట్టాడు. ఆ సాయిబు కొడుకు హయాం వచ్చేటప్పటికి, ఆ కొట్టు అతను కొనెయ్యటమూ పీర్లపండుగ ఆఖరురోజున గాంధీచౌకులో పీర్లగుండాన పడటమూ ఆచారమైపోయింది.

రైతువృత్తికష్టపరంగా కనిపించిన ఒకరిద్దరు మరి రెండు బియ్యంమరలు లేవదీశారు. కాని చిదంబరంగారు (చిన్నచిదంబరం కొడుకు, పెద్ద చిదంబరం తండ్రి) అప్పుడే తండ్రి దగ్గర్నుంచి వ్యాపారం పుచ్చుకొని వుండటంచేతనూ, యువకుడు కావటంచేతనూ వుత్సాహంతో దూరాలోచన చెయ్యగలిగాడు. వూళ్లో వాళ్ళే పోటీకొస్తే సర్వం సున్నా అవుతుందని గ్రహించి కోమట్లతో చేతులు కలి

పాడు. కేవలం బియ్యంమర కాకుండా రైసుమిల్లు ఏర్పాటుచేస్తే మరింత లాభదాయకంగా వుంటుందని నమ్మించాడు. ఆ కోమట్లు వాళ్ళ పెట్టుబడికి తగిన ప్రతిఫలం వచ్చేలాభంతో పంచుకోవచ్చునని విశదీకరించాడు. చిదంబరంగారు, ఆ కోమట్లు కలిసి అన్నపూర్ణ రైస్‌మిల్ లేవదీశారు, ఆ రోజుల్లో ఈ రైస్‌మిల్లు గొట్టంలోనుంచి చిక్‌చిక్‌మంటూ వచ్చేపొగా, ఆ ఆవరణలో ఆరోజుకారోజుకు పెరుగుతూ తర్వాత తగలపెట్టబడుతూవుండే ఆ వూకా అదో వింతదృశ్యంగా వుండేది. రైతులు పెట్టిన బియ్యంమరల రేట్లకన్న ఈ రైసుమిల్లురేట్లుతక్కువగా వుండటంచేత రైతుల బియ్యంమరలు దెబ్బతిన్నాయి, ఆ రైతులూ అంతటితో తృప్తిచెందక వ్యవసాయం మానదలుచుకున్నమరికొందరి రైతులతో వాటాలుచేర్చి మరో నేషనల్‌మిల్లు ఏర్పాటుచేశారు. ఈ రెండుమిల్లుల కారణంగా మా వూళ్లో బియ్యం వ్యాపారం బాగా సాగింది. అదివరకు ఎక్కడినుంచో తెచ్చుకునే మర బియ్యం ఇప్పుడు మావూరినించే ఇతరగ్రామాలకుబళ్ళమీద రవాణా చేయబడుతూ వుండేది.

మావూళ్లో పోస్టాఫీసు ఏర్పాటుకావటంకన్నా ముఖ్యమైనది పోలీసుస్టేషను ఏర్పాటుకావడం. ఇది ఏర్పాటు చేయడానికి అసలు కారణం చెప్పగలిగింది చిన్నపోలాయి. పోలాయి (చిన్నపోలాయి తండ్రి, పెద్దపోలాయి కొడుకు) హయాంలో ఈ రెండురైసుమిల్లులకూ పోటీలు బాగావుండేవి. అప్పుడు పోలాయి చిదంబరంగారి రైసుమిల్లులో పనిచేస్తూ వుండేవాడు. ఒకరోజున అవతల రైసు మిల్లులో పనిచేసే మరోఏనాది ఏదోమాటవచ్చిపోలాయిని చితకతన్నాడు. పోలాయి ఇంటికివచ్చి తనజనాన్ని పోగుచేసుకుని అవతలవాడిమీద కలియపడ్డాడు. ఇరుపక్షాలవారికి పెద్దయుద్ధం అయింది, అనేకమందికి తలలు పగిలినయి. ఈసంగతి పోలీసుశాఖకు తెలిసి మర్నాడు మా వూరువచ్చి పంచాయతీచేశారు. ఇరుపక్షాల సాక్ష్యమూ విన్నారు. చివరకు మొదట పోలాయిని కొట్టిన యానాదిని అరెస్టుచేసి తీసుకానిపోయినారు. దెబ్బలుతిన్నా పోలాయికి ఇదంతా మహాదారుణంగా కన్పించింది. వాడు తనను ఎందుకు తన్నిందీ పోలాయి వూహించుకోలేకపోయినాడు. చిదంబరంగారి మిల్లులో చిదంబరం, కోమట్లు అవతల రైసుమిల్లువాళ్ళని నానా

మాటలూ అనటం పోలాయికి తెలిసిన సంగతి. దీనివల్ల పోలాయికి అవతల మిలువాళ్ళు అంటే ఈర్ష్య, మాత్సర్యం కలక్కపోయినా తనతోపాటు పాటుబడే ఇతరులు కొంతమందికి అవతలమిల్లు వాళ్ళంటే ఎంతో ద్వేషభావము కలిగింది పోలాయికి తెలుసు వాళ్ళూవీళ్లూ కలుసుకున్నప్పుడు ఈ ఈర్ష్య చిన్నచిన్నవిషయాలలో బయటపడేది. ఒకళ్ళంటే ఒకళ్ళకు ఎక్కిరింపూ ఎగతాళి పరిపాటయిపోయింది. మరి పోలాయిని తన్నిన యానాదికూడా ఈరకంగానే మారి వుండాలి. అయితే వాడి మాత్సర్యం మాటలతో ఆగక క్రియారూపం దాల్చింది! రైసు మిల్లుల యజమాన్లు అలాగే నిక్షేపంలావున్నా యానాదిగూడెంలోమటుకు బ్రహ్మాండమైన చీలిక ఏర్పడింది. వీళ్ళ బలాబలాలు వాళ్ళల్లోవాళ్ళు తీర్చుకొనటం అలావుంచి వాములు తగలబడటమూ, దొంగతనాలూ, దొమ్మీలూ ఎక్కువయినై. పోలీసువాళ్ళు తరుచూ మావూరు రావలసిరావటంవల్లవిసిగి ఇక్కడే పోలీసుస్టేషను ఏర్పాటు చేశారు !

మావూరు పెరిగింది. పచారీషాపులూ, బట్టలషాపులూ, ఫ్యాన్సీస్టోరులూ, కాఫీ హోటళ్లూ అన్నీ తయారైనై. వూళ్లో అన్నిమూలలలా కిరసనాయిలుదీపాలూ. ముఖ్యకేంద్రాలలో గాస్‌లైట్లు వెలిసినయి. పంచాయితీబోర్డు మారి మునిసిపాలిటీ అయింది. సిగరెట్లు కిళ్ళీల దుకాణాలు విస్తరించినై, జనాభాహెచ్చి వూరు పెరగటంచేత పాకీదొడ్లు అవసరం అయినై. దాంతో పాకీవాళ్లకాలనీ ఏర్పడింది. మునిసిపాలిటీవారు ఒక లైబ్రరీ స్థాపించారు. వూళ్ళో పరిశుభ్రత అత్యవసరం కావటంవల్ల ఇస్త్రీషాపులు వెలిసినై. ఆదివరకు ఇంత చద్దిఅన్నంతిని, పుల్లమజ్జిగతాగి, పొగాకుచుట్ట నోటిలోపెట్టుకునిపోయే రైతులసంతతివాళ్ళు ఇప్పుడు పత్రికలు తిరగెయ్యటమూ, పేకాడుకోవటమూ జాస్తి అయింది, అనేకమంది రైతులే వ్యవసాయంమాని వ్యాపారమూ. మునిసిపాలిటీ ఎన్నికలలోకి దిగారు, నాగయ్యగారి దొడ్లో వీధిబడిగావున్నది, వేరేచోట ఎలిమెంటరిస్కూలుగా ఎప్పుడో మారింది. విద్య, జ్ఞానం అగ్రవర్ణాలకే లభించేరోజులు తిరిగిరాకుండాపోయినై. యాచనచేసే బ్రాహ్మలూ, వ్యాపారంచేసే కోమట్లూ, సేద్యంచేసే రైతులూ, ఇంకా వున్నా బ్రాహ్మణ కాఫీక్లబులూ, కోమట్లపత్రికల ఏజంట్లూ, రైతుల రైసుమిల్లులు

కూడా తయారయిన్నై. మా వూరినించి వివిధ గ్రామాలకి మోటారుసర్వీసు కూడా తయారైంది.

మిషనరీవాళ్లువచ్చి పోలాయి కుటుంబాలు నివసించే దిబ్బని కొనేశారు. అక్కడ పెద్దబంగాళా నిర్మించారు. ఆ ఆవరణలోనే చిన్నస్కూలు నిర్మించారు. మా ఊళ్ళో మొదటిసారి చిన్న దొరపిల్లవాడిని ఒక దొరసాని పెరాంబులేటర్‌లో పెట్టి తీసుకుపోతుండగా చూచినవాళ్ళలో పోలాయి వకడు. మిషనరీలు క్రైస్తవులు అయినా వారి విద్యాశాఖలోకి అన్ని కులాలవారూ చేరారు. బ్రాహ్మల కుర్రాళ్ళు మాత్రం ఇంటికొచ్చి బట్టలువిప్పేసి మడికట్టుకోకపోయినా మయిలమాత్రం వదిలేశేవారు! ఇంగ్లీషు రాజకీయభాష కావటంచేతనూ, ఆ భాష బోధించే నేర్పు మిషనరీవాళ్ళకు వుగ్గుపాలతో అలవాటు కావటంచేతనూ వాళ్ళ విద్యాశాల అతి వేగంగా పెరిగింది. అదేం తమాషో మా వూళ్ళో మొదట క్రైస్తవులు లేకపోయినా తర్వాత వాళ్ళశాఖ విచిత్రంగా పెరిగింది. దేముడూ దయ్యమూలేని మాలవాళ్ళ క్రైస్తవులుగా మారటంవల్ల వాళ్ళకు ఒకదేవుడులభించటమేకాక విద్యకూడా సంప్రాప్తించినవి. సర్వత్రా అపరకేవున్న దేవుడు వాళ్ళకు అందక ఏ దేశం నించో వచ్చిన దేముడు వాళ్ళకు విముక్తి కలిగించాడు. అదివరకు బ్రాహ్మణ వీథలోకే రావటానికి తాహతులేని మాలవాళ్ళ కొడుకులు ఇప్పుడు క్రైస్తవులుగా హోదా అనుభవిస్తున్నారు. ఈ మిషనరీవాళ్ళ విద్యావ్యాపకంచూచి వూళ్లో పెద్దలంతా చేరి కమిటీ ఏర్పాటుచేసి ఒక పెద్ద హైస్కూలు స్థాపించారు, ఈ స్కూలుకు అనేకమంది మేష్టర్లు బయటినుంచి రావలసివచ్చింది. మిషనరీ స్కూలులో చదివే చాలామంది ఈ స్కూలులో చేరారు. అయినా మిషనరీ స్కూలుకు ఏ కొరతా కలగలేదు. దానికి కారణం మాలవాళ్లు విరివిగా క్రైస్తవులుగా మారుతూ వుండటం!

వ్యాపార లావాదేవీలూ' ఆస్తులు చేతులు మారటాలూ అలవాటు అయింది. తరువాత జిల్లాకోర్టుకు తాకిడిహెచ్చి చివరకు మా వూళ్లోనే కోర్టు, రిజిష్టరాఫీసు ఏర్పాటు చేశారు, కులవృత్తులు జీవిత సమస్య తీర్చలేకపోవటంచేతనూ, విద్యావ్యాసంకొరకు వున్న ఆస్తినికూడా ఖర్చుపెట్టి చివరకు విద్యాజ్ఞానమేమిగిలి జీవనా

ధారం కలక్టు పోయినా కులవృత్తులు మటుకు తిరిగి రాలేదు! న్యాయస్థాపితానికీ, ప్రచారానికీ బోలెడు లాయర్లబోర్డులు మావూళ్ళో వెలిసినై. అనేక గ్రామాల్నించి ఎడ్వోకేట్లు మావూరు చేరారు, వూరివారిగా వీళ్ళకు ఖాతరీ లేకపోయినా, ఆయా వూళ్ళనించి వచ్చే కేసులు వారివారికే లభించటంవల్ల ఈ ప్లీడర్లకు కొంత కాకపోతే కొంత అయినా బ్రతుకుతెరువు ఏర్పడిందని చెప్పకతప్పదు.

మా వూళ్ళో గాసులైట్లు, కిరసనాయిలు దీపాలూపోయి ఎలక్ట్రిక్ దీపాలు వెలిగినమాట వాస్తవమేకాని ఆ శక్తి ఎంతో దూరంనించి మా వూరికి లభించటం వల్ల కామాలు అవి అట్టే కళాకాంతులు కలిగిలేవు! అయినా రేడియోలు వెలిసి గృహాలు ఎన్నో తయారయినై. మావూరి మునిసిపాలిటీ వున్నట్టుండి రద్దుఅయి స్పెషల్ ఆఫీసరు హయాంక్రిందికి రావటము ముఖ్యమైన విషయమేకాని, అది ప్రస్తుతం ఎత్తగూడని విషయం. కాని మావూళ్ళో ఈ మధ్య రజతోత్సవం జరిగిన హాస్పిటలుచరిత్ర చెప్పకతప్పదు. మొదట్లో అసలు మావూళ్ళో ఏదో కషాయాలూ, గుళికలూ ఆచారి వక్కడుతప్ప అసలు వైద్యుడు అంటూనేలేడు. పాకీదొడ్లువచ్చి వైద్యశాల అవసరాన్ని ఎంతైనా ఆగత్యం చేసినై అని చాలామంది నమ్మకం, కాఫీహోటళ్ళు అనేకమందని అనేకరోగాల్ని యావజీవమూ ఏర్పరచినై అని మరికొందరి విశ్వాసం. ఏమయితేనేం చిన్నఆస్పత్రి నొకదానిని స్థాపించి గవర్నమెంటువారు ఎంతైనా మహోపకారం చేశారని చెప్పాలి, ఆ వేళావిశేషమేమిటో ఆ ఆస్పత్రి శుక్లపక్షపు చందమామలా దినదినాభివృద్ధి చెందింది. మా వూళ్ళో రకరకాల రోగాలూ తయారైనై. ఆస్పత్రి చికిత్సలూ అలావుంచి వూళ్లో వున్న వైద్యులకుకూడా తీరుబడిలేదు. వైద్యుల అవసరాన్ని గమనించి అనేకమంది కొత్తవైద్యులు మావూరు చేరుతూ అనేకవిధాల ఈ సమస్యాపరిష్కారానికై పాటుపడుతూనే వున్నారు. ఈ డాక్టర్ల అవసరం నిమిత్తమై అనేక మందులషాపులు వెలిసినై. రకరకాల మందులు, కొత్తకొత్త ఇంజెక్షన్లు, బలహీనులపాలిటి కల్ప

వృక్షంలా నోరూరించే టానిక్కులు ఎన్నెన్నో వచ్చేవి. మందుల వ్యాపారరీత్యా ఆస్పత్రినౌకరీలవల్ల అనేకవిధాలుగా నిరుద్యోగసమస్య కొంత తీరిందని ఒప్పుకోవాలి. మావూరి ఆస్పత్రిలో ఇప్పుడు మరి అయిదువందల రోగులకు కావలసిన అన్ని సౌకర్యాలకూ అవకాశం వుందంటే ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోటాని ఒకప్పుడు మావూళ్లొ అసలుఆస్పత్రేలేదని జ్ఞప్తికి తెచ్చుకుంటేతప్ప సాధ్యం కాదు!

మావూరు యెంతో అభివృద్ధిచెంది ఒక ముఖ్యకేంద్రంగా అయిందనటానికి రుజువుగా విద్యాశాఖమంత్రివచ్చి మానవకోటికి విద్యకంటె వుత్తమమైనది లేదని వాదించారు. పరిశ్రమలశాఖమంత్రి వచ్చి మనదేశానికి పరిశ్రమలు లేకపోవటమే గొప్పలోపమనీ, పరిశ్రమాభివృద్ధి తప్పనిసరిగా జరిగితీరాలనీనొక్కివక్కాణించారు. ఆరోగ్యశాఖమంత్రి వచ్చి స్వయంగా చీపురు పుచ్చుకుని మావూరి రోడ్డుపూడ్చి యెల్లప్రజలూ అలా చెయ్యాలనీ, ప్రతివాడూ పాకీవాడు కావటం యెంతో గొప్పవిశేషమనీ ప్రత్యక్షంగా రుజువుచేశారు. వ్యవసాయశాఖమంత్రి వచ్చి మనకు అనాదినించీ వ్యవసాయమే ఆయువుపట్టుగావుంటూ వచ్చిందనీ, అదిమాని యితర వ్యాపకం చేసినవాడు మనం అధోగతిపాలుకాక తప్పదనీ భయపెట్టారు. మావూరి ప్రజలు యథాశక్తి పాటుపడతారనీ, అభివృద్ధివిషయంలో ఏ ఇతరులకు తీసిపోమనీ మాత్రమే చెప్పగలం!

ఇప్పుడు పెద్దచిదంబరంగారు బంగారుపిచ్చుక. అతని హయాము వచ్చేటప్పటికి రైసుమిల్లేకాక, ఖాదీపరిశ్రమా, ఫ్యాన్సీస్టోర్సు వ్యాపారమూ, సినిమాప్రదర్శనమూ మొదలైన అనేక ఆదాయాభివృద్ధికరమైన వ్యాపకాలు తండ్రి ఏర్పాటు చేసి పోయినాడు. ప్రస్తుతం పెద్దచిదంబరంగారుమటుకు వూళ్ళో ఇళ్ళుకొనటంలో వూపిరి సలపకుండా వున్నారు. చిన్నపోలాయి మాత్రం తాత, తండ్రిలాగా కూలిచెయ్యక పెద్దచిదంబరంగారింట్లో నౌకరీ సంపాదించి జీవించటానికి ప్రయత్నిస్తున్నారు.

"రెండు రోజుల్నుంచి పంతులుగారింటికి రావటం లేదేం ?" అన్నాను చిన్న పోలాయితో,

"ఏంటోకాక తగుల్లుంది బాబూ ! పోనూ పోదు, పెరగనూ పెరగదు ఏం వెధవరోగమో !"

నేను బయటికి వచ్చేశాను. సొరతీగె అల్లుకునివున్న ఆ పూరిగుడిసెలో నుంచి వస్తున్న పొగ యెదురెండలో శోభాయమానంగా వుంది. అవయవాల్నికూడా కప్పుకోటానికి బట్టలేకుండావున్న చిన్నపోలాయి భార్య నన్నుచూసి సిగ్గుపడి అవతలికి తప్పుకుంది. ఎండలో చిన్నపోలాయి కొడుకు మాత్రం ఆకలితో కామాలు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు !

(ఏప్రిల్ 1948 విశాలాంధ్ర మాసపత్రిక)

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం


వెనుక తరాల వారి వీర చరితల సిరుల సేకరణలో సాయపడండి,

అనిసెట్టి రచనల సంకలనం.

ప్రముఖ రచయిత శ్రీమునిపల్లె రాజుగారు బాధ్యత స్వీకరించారు. సాహితీమిత్రులు అనిసెట్టి రచనల వివరాలనందించి, మీదగ్గరుంటే పంపించి తోడ్పడండి జాగ్రత్తగా తిరిగి పంపగలం. అనిసెట్టిసుబ్బారావుగారికి చెందిన సాహితీసమాచారాన్ని వివరాలను కృతులను ఈకింది చిరునామాలలో దేనికైనా పంపమని ప్రార్థన

ఏటుకూరి ప్రసాద్
3-6-737/3
హిమాయత్‌నగర్
హైదరాబాద్.500029

మునిపల్లెరాజు
152, SBI కాలనీ
"వెంచర్" గాంధీనగర్
హైదరాబాద్500038



మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథనపద్ధతి!

— డా. గుమ్మశంకరరావు

కథాసంవిధానంలో సన్నివేశానికి, వాతావరణానికికూడా ప్రాముఖ్యం ఉంది. ఆ ప్రాముఖ్యాన్నిబట్టి వాటి నిర్వహణలో కథకుడు జాగ్రత్త వహిస్తాడు. అక్కడ ఔచిత్యలోపం జరిగితే మొత్తంమీద అనౌచిత్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. సన్నివేశం కథకు సహజంగా అమరాలి. నాయికానాయకులు పాటపాడుకోవడానికి కాశ్మీరు వెళ్ళినట్లు కథలో సన్నివేశం కల్పించకూడదు. ఈ విషయాన్నే మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఇలా చెప్పారు. "…. సన్నివేశాలు ఒక్కటేకాదు. కథా సామగ్రి యావత్తూ వస్తువులోంచి పుట్టుకురావాలి, ఎదగాలి …" శాస్త్రిగారికథన కౌశల్యంలోని చిదంబరరహస్యం ఇది అని వారే స్వయంగా చెప్పుకున్నారు.

రామకృష్ణశాస్త్రిగారి కథల్లో కనిపించే కథనపద్ధతిని స్థూలదృష్టితోచూస్తే ఉత్తమపురుష కథనం ఎక్కువగా ఉన్నట్లుతోస్తుంది. చాలాకథలు ప్రత్యక్ష కథనాలు. కొన్నికథలు పరోక్షకథనాలు, ఇలా చెప్పినందువల్ల శాస్త్రిగారి కథనపద్ధతి చెప్పినట్లు కానేకాదు. ఈ పద్ధతులు చాలామంది కథల్లో కనిపిస్తాయి. అందుకే వీటికి భిన్నంగాఉన్న కొన్ని ప్రత్యేకతలుగల కథల్ని పరిశీలించటం అవసరం.

"ఔను నిజం" అన్న కథలోచూపిన కథనపద్ధతిలో ఒక ప్రత్యేకత ఉంది. ఈకథలో మూడుభాగాలున్నాయి. ప్రతి భాగారంభంలోనూ, టీకప్పు వర్ణన వ్యంగ్యంగా ఉంది. మొదటి భాగారంభంలో….

"కప్పునిండా ఉన్నది టీ, స్పూన్‌రవ్వంత అలికిడికే పొరలి సాసరులోకి ఒలికిపోయేటంత నిండా." ఇంక రెండో భాగారంభంలో.

.... "రెండుగుక్కలకే ఖాళీ అయిపోయింది. మరగకాగిన పాలమీగడ అటూయిటూ పైఅంచులను అక్కడక్కడ ఆవరించివున్నది" మూడోభాగారంభంలో.... "ఇద్దరికీ అందుబాటుగా టీపాట్ .... ఉన్నది. రెండవతడవ నిండిన కప్పులు.... సమపాళంగా సగంవరకు తరిగివున్నవి." ఈ మూడు సందర్భాలలోనూ స్నేహితులు చర్చించుకొంటున్నప్పుడు—

1) "అనుకున్నంత పని జరిగింది.... చివరకు"

2) "అనుకున్నంత పని అయింది."

3) "అనుకున్నంతా.... అయింది." అని ఓవాక్యం వినబడుతూ వుంటుంది. వీటిమధ్యనే ఈ కథ నడవడం ఇక్కడ ప్రత్యేకత, ఈకథ టూకీగా.... శేఖరం, మంజరి ప్రేమించుకుంటారు. పెళ్ళి చేసుకుందామనుకుంటారు. ఆ విషయమే స్నేహితుడికి "అనుకున్నంత పని జరిగింది" అని చెప్తాడు.

పెళ్ళి అయింది. హానీమూన్‌కు ముస్సోరి వెళ్ళారు, అంతే– ఆమె కోరినరీతిగా.... ఎదుటపడి.... పురివిప్పి నాట్యం చేయడమే.... ఈసాలభంజిక.... అని శేఖరం వాపోయాడు. దానినే స్నేహితుడికి "అనుకున్నంత పని అయింది" అని రెండోసారి చెప్తాడు.

కావ్యం ....కామినీ– ఎవరికి జయం? అన్నది శేఖరానికి ఎడతెగని ప్రశ్న. "ఎవరిత్రోవ వారిదైన తరువాతకాని.... ఆ హోరు తగ్గలేదు. అదే స్నేహితుడి అనుకున్నంత పని అయింది," అని శేఖరం చెప్తాడు. ఈ కథలో ప్రేమించుకోవడం, పెళ్ళికావడం, విడిపోవడం, ఈమూడూసంఘటనలు. ప్రతిభాగారంభంలోనూ "టీకప్పు" వర్ణన ఉండటమే కథనపద్ధతిలోని ప్రత్యేకత అవుతుందా? దానికి బదులు మరోవర్ణనా చేసినా అది ప్రత్యేకతకిందికి వస్తుందా? అంటే అది ఆ చేసిన వర్ణనకూ కథకూగల సంబంధాన్నిబట్టి తేల్చవలసినదని చెప్పవచ్చు అయితే యిక్కడ ఈ టీకప్పు వర్ణనకు కథతో ఎంతచక్కని సంబంధమున్నదో చూడండి.

మొదట చేసిన టీకప్పువర్ణనలో యౌవనపుపొంగూ, వయస్సులోనిఉడుకూ ఎంతనిండుగా ఉన్నదీ ధ్వనింపబడింది. ఇదంతా వ్యంగ్యవైభవం, ఇంక రెండోసారి చేసిన టీకప్పు వర్ణనలో యౌవనపుపొంగు తగ్గిందని "మరగకాగిన మీగడ అటు, ఇటు పై అంచులను అక్కడిక్కడ ఆవరించి ఉన్నది" అనడంలో అక్కడక్కడ యౌవనశేషం మిగిలిఉన్నదని చెప్పబడింది. మూడోసారి టీకప్పు వర్ణనలో "రెండవ తడవ నిండిన కప్పులు సమపాళంగ సగంవరకు తరిగియున్నవి" అనడంలో యౌవనపుపొంగు ఇద్దరికి తగ్గిందని ధ్వనిఉంది. ఈయౌవనపు పోంగుని ఈ టీకప్పు వర్ణనలో వ్యంగ్యంగా చెప్పడమే ఇక్కడి ప్రత్యేకత. ఇలాగే "వంచనాయకం" కథ నవ్వుతో అరంభమై నవ్వుతో అంతమవుతుంది, పాత్రల సంభాషణలద్వారా కథనడపడం కథనపద్ధతిలోన ఒకబేదం, అలాంటికథలు శాస్త్రి గారు వ్రాశారు. అందులో "కణ్వాశ్రమం", "గుణనంధి" కథలు చేరుతాయి, సంభాషణలద్వారా కథ నడిపేటప్పుడు కొందరు ఏపాత్రచేత పలికిస్తున్నదీ తెలియడానికి ముందు పాత్రపేరు చెప్పి సంభాషణ చెప్తారు. మొదట పూర్తిపేరుచెప్పి, తర్వాత పొడిఅక్షరాలతో వాటిని సూచిస్తారు. కాని శాస్త్రిగారు అలాపాత్రల పేరు చెప్పరు. అది పాఠకుడు సులభంగా అర్థం చేసుకొనేటట్టు ఒక్కొక్క సంభాషణ కొటేషన్‌లలో పెడ్తారు. అంతేకాకుండా ఏపాత్రకాపాత్ర సంభాషణను విడివిడిగా వ్రాస్తారు.

కణ్వాశ్రమం కథలోని పాత్రలు :-

1) ఒక్కకొడుకు పుట్టగానే విధవ అయిన తల్లి.
2) ఆమె కొడుకు.
3) అతని కూతురు పెళ్లిడువచ్చిన లక్ష్మీసుందరం.

మనుమరాలు లక్ష్మీసుందరం ఎదురింటివాడితో లేచిపోయిందని కొడుకు దగ్గర గోలచేస్తుంది, మూడునెలల తర్వాత వచ్చినకూతుర్ని తండ్రి గదమాయించాడు. ఆ పిల్ల మామగార్కి చెక్కు బుక్కుయిచ్చి ఎంత కట్నం యివ్వాలో

రాసుకోమంటాడు. అయిదువేలు రాసుకుంటే కనీసం పదిహేనువేలు అయినా రాసుకోమని దెబ్బలాడానని కూతురికిచెపుతాడు. అంత ఉదారహృదయుడుకొడుకు. గాంధర్వవివాహాల్ని అభిలషించే వాడతడు.

ఇందులో శాస్త్రిగారు సంభాషణలద్వారా కథ నడిపించారు. ఆ సంభాషణలు యిలా ఆరంభమయ్యాయి.

" అబ్బాయ్ .... "

" ఓరి నాయనా .... "

కొంప నట్టేట్లో కలిసిపోయిందిరా. ఏంరాత, బ్రహ్మరాత, ఉలకవు, పలకవు. నిన్ను కాదన్నట్లు అలా బుద్ధావతారంలాగా మెదలకుండా దిక్కులుచూస్తూ ఊరుకుంటావేమిరా ? నీకు చీమ కుట్టినంతైనా లేదేంరా ?"

"లేకేమమ్మా' చీమ ఏమిటి, చెవిక్రింద జెర్రులు పుట్టపెడితివి. పనసంతా ఏకరువు పెట్టడం అయిందా. ఇంకా ఏమన్నా కురదలా ఉన్నదా ?.... ఉంటే ఊ కానీయ్: మంచి శ్రుతిలో ఎత్తుకువున్నా ?

"కాని-యింతకు యింతా ఈ జన్మలోనే అనుభవిస్తున్నా, ఇంకా బుద్ధి రాదా-యెను, ఇంతేలే, ఇహ ...."

"అంతేలే........పెద్దదానవు కన్నతల్లివి, నీదీవన ఊరికేపోతుందా? ....నా కోరిక అదే!"

"ఎందుకు పోతుందీ? నీబుద్ది ఎన్నడైతే, ఇలాపెడతలబట్టిందో, ఆనాడేనాకు "కాని వాడవైనావని ఓశోకం పెట్టి ఊరుకూంటేనో, నాచేసిన చేతంతా గంగలో కలిసింది. నీనిర్వాహకత్వానికి, సంబరాలు పడుతూ చంకలు గుద్దుకుంటూనే, ఉన్నాను—నీవు చెడేదికాకుండా నిక్షేపాలకుప్ప-పండంటి పిల్లను పాడుచేస్తివి కదరా

ఈ పై సంభాషణల్లో ఏది విధవతల్లి సంభాషణో, ఏది కొడుకు సంభాషణో ఓతల్లి, దానికో కొడుకూ, అతనికో కూతూరూ ఉందనీ, దాన్ని తండ్రి పాడుచేశాడనీ కొంతకథ ఈసంభాషణవల్లతేలింది,

ఇది సంభాషణలో కథ నడిపే శాస్త్రి గారి కథన పద్ధతి స్వగతంలోనే కథను నడిపే కథన పద్ధతిని కూడా రామకృష్ణశాస్త్రిగారు అనుసరించారు. దీక్షపంచచామరం అనే రెండు కథలో ఈపద్ధతి కనిపిస్తుంది. ప్రథమపురుషులో స్వగతంగా, దీక్షకథ నడవగా, పంచనామరం కథ ఉతమ పురుషస్వగతంగా నడిచింది.

దీక్షకథ :- పాత్రలు :- (1) తండ్రి (2) కొడుకు (3) కోడలు "బాల" (4) పేపరు రిపోర్టరు అయ్యరు (5) బాలస్థానంలో వచ్చిన అమ్మాయి (6) ఆమెతండ్రి (7) పోలీసు రాయుడు. తండ్రి చండశాసనుడు. డబుకిచ్చిన విలువ దేనికీ యివ్వడు. అందుకే దయాదాక్షిణ్యాలులేకుండా వియ్యాలవారు ఇవ్వవలసిన కట్నంబాకీ రాబట్టుకోవడానికి పుట్టింటికి కోడల్ని నెట్టివేస్తాడు. తండ్రిని ఎదిరించలేని వట్టి పిరికివాడు కొడుకు. భార్య ఏడుస్తూ బండెక్కినా వారించలేక పోతాడు.

చివరకు ప్రసవించి ఆమె పుట్టింట చనిపోతుంది. అప్పుడుకూడా తండ్రి మాటకాదనీ అక్కడికి వెళ్ళలేని వట్టిపిరికిపంద కొడుకు.

మనసారా భార్యనుతలచుకోవడానికి వీలులేనిపరిస్థితులలోచేత కానీలేకుండా పట్నంవెళ్ళి, తిప్పలుపడి, ఓ ఉద్యోగం సంపాంచుకుంటాడు. ఓనాడు కారుక్రింద పడబోయే తనపై అధికారి కూతుర్ని రక్షిస్తాడు, దానికి ఆ తండ్రికూతుళ్ళు యిద్ద వచ్చి వీరపూజ చేస్తారు.

ఆ సాయంకాలం బయటకు వెళ్ళబోతూ ఉండగా ఆమె మళ్ళీ కారులో వచ్చి చేయి అందించి బీచ్‌కి తీసుకువెల్తుంది. ఎంతో అనురాగాన్ని చూపుతుంది. అప్పుడామెకు తన పూర్వగాథ చెబుతాడు. ఆమె జాలి పడుతుంది. చివరకు యింటికి వస్తాడు. మళ్ళీ ఒకటి, రెండురోజులు ఆమె రెండు, మూడుసార్లు వచ్చి అతనిపై చొరవ చేస్తుంది. అతడు కసురుకుంటాడు.

తర్వాత ఉద్యోగానికి రిజైన్ చేసి ఒక ట్రాంక్రింద పడదామనుకుంటాడు. ఆ ప్రమాదంలో స్పృహదప్పి ఆస్పత్రిలో చేరతాడు. పదిరోజులూ ఆయన్నికంటికి రెప్పలా ఆమె చూసుకుంటుంది.

[illegible] వచ్చిన పోలీసు 'రాయుడు' అతణ్ణి "మీరలా ట్రామ్‌కు [illegible] హంతకుడు దొరికేవాడుకాడు" అని పొగడుతాడు. లేని [illegible] ఒప్పుకున్నాడు. ఈ (Coward) పిరికివాడు బాలనే [illegible] అందుకుంటాడు. ఆమె సుమంగళి. ఈ కథ [illegible] ఎలా [illegible] చూడ్డానికి కథారంభఘట్టం పరిశీ[illegible]

"[illegible] — [illegible] — [illegible] —"

[illegible] అలా, ఉలిక్కిపడుతూ, పక్కమీద [illegible] తనంతోనే.... కలలో మెరసినదీనపు [illegible] ఉపక్రమించాడు.... [illegible] —

[illegible] — [illegible] — అవే పరివేదనలో ప్రతిమాలే [illegible] — [illegible] అవి [illegible] పెదవులమీద, మందార [illegible] — [illegible] అదే కల!

[illegible] — [illegible]. ఈ జన్మకు తిరిగి కలుసుకోవటం వుండ[illegible] — [illegible]తో గుండె పుండివుండి జల్లుమంటూంది, [illegible] తెల్లవార్లూ, బాలమంచాన్ని ఆనుకుని [illegible] — [illegible] పంపమాకండీ! నాకేమో భయంగా, తగని [illegible] ఏమైనాసరే, మీ దగ్గరినుంచి పంపేయకండి!.... అని ఎంత [illegible] — [illegible] ఎక్కేటప్పుడు.... ఎలా విలపించింది.... కడసారి.... ఎలా చూసింది!

[illegible].... తండ్రిమాటకు ఎదురుఆడి.... భార్యనుపంపకుండా నిలుపుకునే సాహసం, అప్పుడు లేకపోయింది. తరువాత.... ఎన్నిసార్లు ప్రయాణమైనా.... ఆయన అనుగ్రహించి పైసారాల్చిందే ఎక్కడికి కదలడం ?....

ఉత్తరం వ్రాయడానికి అణాడబ్బులకు గతిలేనివాడికి ఊరి ప్రయాణానికి....

ఈ స్వగతంతోనే కొంత కథ నడిచింది. తండ్రికెదురాడలేని ఓకొడుకు. అతని భార్యబాల. తన భార్యను బలవంతంగా తండ్రి పుట్టింటికి పంపుతూఉంటే వారించలేకపోయాడని వట్టి పిరికిపందనని తననితాను నిందించుకుంటున్నాడు— ఇంతవరకు సాగిన స్వగతంలో శాస్త్రిగారు నడిపినకథవల్ల అతని ఈ కథనపద్ధతి స్పష్టమవుతుంది. ఈ స్వగతం ఓపాత్ర ముఖతః చెప్పించడానికి ఓ సంఘటన దగ్గరనో, ఓ సన్నివేశం దగ్గరనో కథనిలిపి స్వగతం అందరివలె శాస్త్రిగారు చెప్పించలేదు. "కల" దీనికి అనువైనదిగా ఎన్నుకుని స్వగతం పలికించారు. "పంచచామరం" కథలోని ఓ సంఘటన ఎన్నుకుని అక్కడ ఆ పాత్ర మనస్సు లోని ఆలోచనలే ఆలంబనం చేసుకుని స్వగతంలో కథ నడిపాడు.

రంభలాంటి పిల్లని పెళ్ళాడి ఊరుకానిఊళ్ళో అద్దె యింట్లోపెట్టి చివరకు అద్దె ఎగవేసి ఒక చాకలిదానితో ఈ పిల్లభర్త లేచిపోతాడు. అయినా యిల్లు అద్దె కిచ్చిన ముసలాడు ఆమెను తన పిల్లలాగే భావించిటిక్కెట్టుకొని గుప్పెడురూపా యలు చేతబోసి, రైలెక్కించి, పుట్టింటికి పంపుతాడు, ఆ గుప్పెడు రూపాయలూ ఆమె చేతిలో పొయ్యడానికి ముందు ఆమె నిర్విణ్ణఅయి ఉండగా ఒంటరిగాఉన్న ఆమెకోసం లొట్టలు వేసుకుంటాడు— ఓ వయస్సులోఉన్న కుర్రాడు. ఆమె నాక ర్షించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు, తరువాత అసలు విషయం తెలిసి ఆ కుర్రాడు చాలా బాధపడతాడు. ఎన్నో బుద్ధులుతనకుతానే చెప్పుకున్నను, అయినా మళ్ళీ ఎక్కడయినా స్త్రీ కనిపిస్తే అలవాటుచొప్పున మొదటికే వచ్చేది ఆయన స్వభావం. ఈ కథలో స్వగతం యిలా నడిచింది:— కడుపు నిండిన....బేరం ! నిండుకుండ.... అప్పుడే తొణకడానికి ప్రారంభించింది. ఒళ్ళుపొగరు తాక పోతే.... చూస్తేనే.... కడుపు నిండుతుందా ? నిజంగా.... ఆ అమ్మాయి అలానే ఉంది ! అయితేమాత్రం ఎంత ఒంటరిగా కూర్చుని ఉంటేనేం ఎగాదిగాచూస్తూ ఎదురుగా దీపస్తంభాన్ని అనుకుని వతికిలబడటం నాకు అప్పుడు అదేం పోయే కాలం ?

ఏ సైలుకు వెళుతుందో ?....

ఎటు వెళ్ళినా.... ఇంక అరగంటదాకా ఎక్కడికీ బండిలేదుకదా?.... ఇం తలో కలిసిరావాలికాని.... ఎంత గ్రంథం నడవకూడదు? ఏమో తీరా పాకానపడ బోయేసరికీ, అంతవరదాకా... అలాగే ఓచోట కూలేసి ఏరాజ్యాలో ఏలబోయిన ఆ ఘనుడు మెడనుతాడు బిగించిన ఎవరో ఆ వెధవాయ తీరా తగుదునని ఆ సమ యానికి అక్కడకు తయారైతే మనం యిక అటూయిటూ మెసలడానికి ఏమాత్రం వీలుండదు. మన వేషాలేమీ సాగవు.... అనవసరంగా.... సిద్ధాన్నం.... ఆ కాస్తా చెడి ఊరుకుంటుంది.

అయినా అందాకావచ్చిన తరువాత అప్పటి సంగతి చూసుకోవచ్చును, యిక యథావిధిగా కార్యక్రమానికి ఉపక్రమించవచ్చును. ఇలా నడిచింది, మొత్తం స్వగతంలో కథ నడిపి రక్తికట్టించడం సామాన్యమయిన పనికాదు. ఎంతో శక్తిమంతుడయిన రచయితకు మాత్రమే అది సాధ్యం. ఎందుకంటే ఎదుట ఎవ్వరూ లేకుండా ఏదో తనలోతాను మాట్లాడేవాణ్ణి పిచ్చివాడంటారు. ఆ మాటల్లో పిచ్చిలేకుండా అర్థవంతమైన కథనడుపుతూ పాఠకుల్లో ఉత్కంఠను పరి పోషించుకుంటూ కొసవరకూ కథను చదివించే గుణాన్ని అందులో యిముడుస్తూ స్వగతంద్వారా కథను నడిపించే శక్తి రామకృష్ణశాస్త్రిగారికిఉంది. ఇందులోయితని ప్రత్యేకత అదే.

రామకృషశాస్త్రిగారి కథనపద్ధతిలో Flash Back పద్ధతి ఒకటి, ఒక్క కథకుడే చెప్పినకథ— "తమసః పరస్తాత్" ఈ కథాసారాంశం యిలా :—

పదిహేడేళ్ళ చిన్నది రోజూ కనుచీకటివేళ అలా కులుకుతూపోయి, తెల తెలవారుతుండగా నలిగివచ్చేది. ఏమిటా ? అని కథకుడు పరిశీలించాడు. రామయ్య అన్న కూతురు పదిహేడేళ్ళ చిన్నది. వెన్నెలనీడను ఒళ్ళు విరుచుకుంటూన్న చీక ట్లోకి,.. కొండి ఎత్తుకున్న తేలులాగా చరచరా ప్రాకింది.

గాజులు తళుక్కుమన్నవి కానిగలగల చలాకీలేదు. చీరె అంచు ఉత్త రీయపు మగసిరితో మీసం దువ్వుతూంది.,. చీరె కుచ్చెళ్ళు.... కాళ్ళకు బంధాలు

లేదు. నేలమీద విడివడి నీడపడకుండా ఆ అడుగులలో అడుగుఒదిగి ఆ కంఠానికి పెనవేసుకుపోయినవి. గాజులు పప్పుపప్పై కంకణరేకలు జేగురించినవి. అంటే ఈ కథలో వయస్సులోఉన్న ఓ వన్నెలాడిని మరో పదిహేడేళ్ళ చిన్నది పెనవేసుకుంది.

కథకుడు ఒక్కడే చెప్పిన కథ మరోపాత్ర సంభాషణలేదు దీనిలో ఫ్లాష్‌బ్లాక్ పద్ధతిని శాస్త్రిగారు అనుసరించారు పరిశీలించండి.

మనసు ఏమి బాగుండలేదు- మబ్బువేస్తే బాగుండును అనుకున్నాను ఫెళ్ళుమంది వెన్నెల.

కళ్ళు కుట్టుతున్నాయి, కంకంటి పాపరాజును కప్పుకున్నాను. నందన వనంలో, పదితలలరాయుడు కోడై కొక్కిరించాడు.

...ఎన్నడో మరచిపోదామనుకున్న... పాడుకథ... నిలవేసి వెక్కిరించడం మొదలుపెట్టుతుంది. కక్కేస్తాను, చిన్నది...

...పదిహేడేళ్ళది...

ఆ ఊరూ అలదానిపేరూ, మీకు అనవసరంలెద్దురూ... అవాళ...

ఇవాళ వెన్నెలే

సాదారణంగా ఈ Flash Back కద్ధతిని·సినిమాలోఅయితే క్యాలెండరులోని పాతపుటలు గాలికి ఎగిరినట్లు చూపడంతో చిత్రిస్తారు. లేదా గడియారపుముల్లు వెనక్కి తిరుగుతున్నట్లు చూపి వెనుక కథను గతస్మృతుల్ని చూపెడతారు, లేదా తత్త్వంపాడే వాడినోట "ఆవాడు"అనిపించి పాటనిచూపిస్తారు. ఇంకా యిలాంటి పద్ధతుల్ని అనుసరిస్తారు,

కాని కథా రచయితలు కథల్లో నిద్రలో కల వచ్చిందని ఆకలలో గతస్మృతుల్ని చూపుతారు. అదిFlash Back పద్ధతి చాలమంది కథకులు చేసేపని. కాని రామకృష్ణశాస్త్రి గారు అలాంటి మార్గాన్ని ఆశ్రయించలేదు.

కంకంటిపాపరాజు వ్రాసిన ఉత్తరరామాయణంలో రంభారావణ సంవాదం చదువుతూ ఉంటే- పాడుకథ గుర్తుకు వచ్చిందింటారు. "అవాళ-ఇవాళ వెన్నెలే" ఒకే పోలిక ఉన్న సన్నివేశం వల్ల గుర్తుకువచ్చే స్థితిని ఆశ్రయించి Flash Back పద్ధతిలో కథనం సాగించారు. ఈకథనపద్ధతిలో యిది వీరి ప్రత్యేకత.

వీరి కథల్ని లోతుగాపరిశీలిస్తే కబుర్లలో ఎన్నో కథలు చెప్పే చెళ్ళపిళ్ళవేంకట శాస్త్రిగారి బాణీ వీరికథనంలో ఉంది. అలాగే కథలుగా ఎన్నెన్నో కబుర్లు చెప్పే శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి గారి బాణీ కూడ వీరి కథనంలోద్యోతకం మవుతుంది

శృంగారానందబోధనం (ఉరఫ్ తాతయ్యకథలు) వర్గీకరణంలోని అన్నికథలూ స్థలపురాణం వర్గీకరణంలోని అన్ని కథలూ, కబుర్లలో కథలు చెప్పే కథనపద్ధతిలో కి వస్తాయి. ముఖ్యంగా "చూర్ణిక" "మంత్రపుష్పం" కథల్లోని కథనపద్ధతి వేంక టశాస్త్రిగారి బాణీకిచెందినవని నిరాఘాటంగా చెప్పవచ్చు. రామకృష్ణశాస్త్రి గారి కథల్లో "తాతయ్యపాత్ర సృష్టికి ఓవిశిష్టతఉంది. ఆదునిక సంస్కృతిపురాతన సంస్కారాన్ని కలచివేస్తే చూచి సహించలేనివాడు తాతయ్య. ఆతాతయ్య రామకృ ష్ణశాస్త్రిగారే అని పాలగుమ్మిపద్మరాజు, ఆరుద్ర అభిప్రాయపడ్డారు.

ఒకసారి పురాతత్త్వశాఖ వారు కొల్లేరు దగ్గర తవ్వకాలు మొదలు పెట్టదలచిన ప్పుడు అప్పటికప్పుడు ఒక అభూతకల్పనను కథగా చెప్పి వాళ్ళను ఆ ప్రయత్నం నుండివిరమింప చేస్తారు. ఈవైనం విశదం చేసి కథకుడు యిలా ప్రశ్నిస్తాడు. తాతయ్యలో ప్రగతిశీలత లేదంటారా మీరు. అనండి........ఆయన ఒక్కడిలోనే కాదు-మా ఏ ఒక్కడిలోనూ లేదు, ఆదిబ్బలు, ఆపోదలు ఆరొదలు లేకపోతే మాకు మాసీమకు వేడుకేముంది, ముచ్చటేముంది, ఈప్రశ్నలు వేశాక యిలా ఆయన ముగిస్తాడు,

వెయ్యి అబద్ధాలాడి ఒక యిల్లు నిలపమన్నారు పెద్దలు. "ఓక అబద్ధం ఆడి మూడు దిబ్బలు కలకాలం నిలిపాడు తాతయ్య స్వస్తిరస్తు;"
ఇది "అనవుడు-నావుడు" అనే కథలోనిది.

ఇలాంటిదే మరోకథ "కలికితురాయి" దీనిలో "లేమల్లె సింగారం" అన్న గ్రామాల పుట్టుక గురించి మహాద్భుతంగా కథ శాస్త్రిగారు చెప్పారు.

వెర్రి గొల్లడు సింగన్నను మల్లిక ప్రేమిస్తుంది. అతడుకాదంటాడు. మనసురాయి చెసుకొని వెళ్ళిపోవాలనుకుంది. కానికాళ్ళు రాలేదు. అక్కడే పడిపోయింది. సింగన్నను గోవులు తరిమాయి. అ తడికాళ్ళను మల్లికచుట్టుకుంది. సింగన్న మల్లిక! అని పిలిచాడు. ఆమె పేరినముద్దుగా రాలిపడింది మల్లిక నవ్వినచోట లేమల్లె. సింగన్న మనసు తెలిసినచో సింగారంగా వెలిశాయి. ఇవికబుర్లలో చెప్పిన కథలు. అందుకే ఈకథనపద్ధతిని వేంకటశాస్త్రిగారి బాణి అనవలసివస్తుంది. కథలుగా ఎన్నెన్నో కబుర్లు చెప్పడం శ్రీపాదసుబ్రమణ్యశాస్త్రిగారి బాణీ, ఈకథన పద్ధతి కూడా రామకృష్ణశాస్త్రి గారిలోఉంది. ఈపద్ధతి వీరి "ద్విపద" చూర్ణక" డుమువులు" కథల్లో కనిపిస్తుంది,

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు పెద్దాపురం సంస్థానం గురించి మంచి కథలు వ్రాశారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు అనాటి తిక్కన్న సోమాయాజులు గారు దగ్గర్నుంచి మొన్నమొన్నటి కార్వేటినగరం రాజు దాకా ఎందరో సాహిత్యరంగంలోని చారిత్రక వ్యక్తులపై కథలు రాశారు,

"డుమువులు" (కవి తిక్కన కుమ్మరి గురునాథుల బంధుత్వం), అమరావతి (వాసిరెడ్డి వేంకటాద్రి నాయనికథ), మధుర (వాసిరెడ్డివారికథే), అంగరక్ష (నూజవీటి సంస్థానంలో బుచ్చినాయిని గారికథ).

రామకృష్ణశాస్త్రిగారి కథన పద్ధతిలో మరోకటి చెప్పుకోవలసినదిఉంది, అది కేవలం చేయితిరిగిన రచయిత. కొమ్ములుతిరిగిన కథారచయిత మాత్రమే చేయగలిగింది. పాఠకులలో ఉత్కంఠను పరిపోషించడానికి కావలసిన శృంగారాది భావ-నలు ఎరపెడుతూ కథారచయిత లందరూ కథా కథనం సాగిస్తారు. కాని రామకృష్ణశాస్త్రిగారు "కథముగిసింది" అనే చోట కథఆరంభించి, పాఠకుని చేత కథ చదివింపజేసే ఉత్కంఠను నిలబెట్టి వ్రాయగలరు. ఇది వాల ఆపూర్వమైన కథన పద్ధతి

ఈ పద్ధతి చోటు చేసుకున్న "మంత్రపుష్పం" కథారంభం చూడండి, పాపం!- చిట్టిరాలిపోయిందిరా! అన్నాడు. మొన్నమొన్ననే జిల్లా కాంగ్రేసు సంఘంలో కృత్యాద్యవస్థ మీద సభ్యుడుగా నిలబడ్డ మా పంతులు.

"ఎప్పుడు?" అని మేంనలుగురం అడిగాము, గొంతులు బిగిసి.

"వారంరోజులయింది" అని జవాబు ఎక్కడో నూతిలోంచివచ్చినట్టు.

"బ్రతికి ఎందరో్ని సుఖపెట్టింది. పోయితాను సుఖపడుతూంది."

అంలో మాటూ ఒకడినిట్టూర్పు.

"ఆబ్రతుక్కి చచ్చిపోవడం కన్న సుఖమేముంది?. తెరిపి ఏముంది? అదృష్టవంతురాలు!" అని మరొకడి సాకారం.

అవును దాని బ్రతుకంతా చచ్చిన చావే అదికాగా నెట్టుకొచ్చింది కాని, మరో అదైతే ....

"మరో ఆడదానికి అంతదమ్ముంటదా? —గట్టిగా చెడిపోయేందుకన్నా నిష్టంటూ ఒకటి ఉండాలి —"

ఇందులో "పాపం :చిట్టిరాలిపోయిందిరా!" అన్న దగ్గర రామకృష్ణశాస్త్రిగారు కథ ప్రారంభించారు. ఇదే కథ ముగిసింది అన్నచోట కథ ఆరంభించే కథనపద్ధతి చిట్టిచచ్చిపోవడంతో చిట్టి కథ పూర్తవుతుంది. మరి ఆ కథ అక్కడ ఆరంభించి చదివించాలంటే ఎంతటి శక్తి సామర్థ్యాలు శాస్త్రిగారు చూపి ఉండాలి. చిట్టి ఆత్మహత్య చేసుకుందనిరాస్తే అయ్యో దానికి కారణమేమిటో అని ఔత్సుక్యాన్ని కొందరు కనబరచి చదువుతారు. మరి అలా కథ ఆరంభించలేదు, "చిట్టిని ఎవరో హత్య చేశారు" అని రాస్తే కూడా కొంత మంది ఆసక్తితో కథ చదువుతారు. మరి అలా కూడా ఆరంభించలేదు. "మిసమిసలాడే యౌవ్వనంలో ఉన్న చిట్టి రాలిపోయింది." అని ఆరంభిస్తే ఆయౌవనం, శృంగార భావపు ఎరలో కొందరైనకథ చదువుతారు, అలా కూడా శాస్త్రిగారు ఆరంభించలేదు, మరిపాఠకుల్లో పఠనాసక్తిని నిలబెట్టే కీలకం ఎక్కడ బెట్టారు?

[illegible] "[illegible] ప్రతివానికి యిచ్చే వ్యాఖ్యానంలో" అని చెప్పవలసివస్తుంది "[illegible]" అనిమేం నలుగురం అడిగాము గొంతుబిగిసి ఇందులో "గొంతుబిగిసి" [illegible] అని అడిగారన్న వ్యాఖ్యానంలోనే వాళ్ళ ఆరాటం ద్వారా పాఠకుని ఆక [illegible].

"వారం రోజులయింది" అని జవాబు ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టు, 'వారం రోజులయింది' అని రాస్తే పాఠకుని గుండెలోకి రచయిత ప్రవేశించలేడు అందుకేదానికి "జవాబు ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టు" అని కథకుని వ్యాఖ్యానం [illegible]. 'నూతిలోంచి' అనడంతో ఆమె చచ్చిపోవడంలోని బాధవ్యక్త [illegible] పాఠకుని గుండెల్ని పిండుతుంది.

"[illegible] పోయి తాను సుఖపడుతుంది" అంటూ మాలో [illegible] అన్న కథకుడి వ్యాఖ్యానమే పాఠకునిలో ఆ [illegible]

"ఆ బ్రతుక్కి చచ్చిపోవడం కన్న సుఖమేముంది? తెరిపిఏముంది? అదృష్టవంతురాలు అని [illegible] ఆకారం.

ఇందులో క్రీగీత ఉన్న భాగం కథకుడి వ్యాఖ్యానం, "అదృష్టవంతురాలు" అంటూ ఆ బ్రతుక్కి చచ్చిపోవడం కన్న సుఖమేముంది? అనడం స్వవచన వ్యాఘాతంలా భాసించి అదేమిటో ఆ బ్రతుకేమిటోతెలుసు కోవాలనే ఆసక్తిని పెంచుతుంది,

"మరో ఆడదానికి అంతదమ్ముంటుందా? గట్టిగా చెడిపోయేందుకన్నా నిష్టంటూ ఒకటి ఉండాలి"

ఈ క్రీగీత ఉన్న భాగంకూడా కథకుడి వ్యాఖ్యానమే. గట్టిగా చెడిపోవడం ఏమిటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస రేకెత్తించారు. ఈ వ్యాఖ్యానం వల్ల యిలా పాఠకునిలో ఉత్కంఠను పరిపోషించడం ఈకథన పద్ధతిలోని విశిష్టత, విలక్షణత. ఇది వాస్తవానికి అపూర్వమయినది. ఇంతవరకు రామకృష్ణశాస్త్రిగారి కథన పద్ధతుల్లోని కొన్ని భేదాలు పరిశీలించడం జరిగింది,

(మిగతా భాగం వచ్చే సంచికలో)

కోరిక

ఆంటోనీ స్లోనిమ్‌స్కీ (పోలిష్ కవిత)
స్వేచ్ఛానువాదం—సౌభాగ్య

[illegible]పాస్ లేదా అంకారా; హంగెరీ లేదా స్కాట్‌లాండ్
లిస్బన్ లేదా తాకర్ లేదా లండన్
ఆ తరంగం మనల్ని ముందుకే తీసుకెళుతుంది.
వెళ్ళే కొద్దీ వెళ్ళే కొద్దీ గృహాభిముఖుల్ని చేస్తుంది.
మనం ఎందుకోసం యుద్ధం చేస్తున్నాం? ఏమిటి కోరుకుంటున్నాం?
[illegible] అఖండ సంపదల్ని పోగొట్టుకున్నాం?
ఈ బాధాయాత్రలో మనం ఆశించేవి కీర్తికనకాలు కావు
మహోన్నతమైన, పవిత్రమైన కారణం కోసం పరితపిస్తున్నాం.
ప్రపంచం మీద ప్రభుత్వం చెలాయించడం మనలక్ష్యం కాదు.
[illegible]ని కలగంటున్నాం
[illegible]కాలంగా, ప్రశాంతంగా వ్యాపించిన చెట్ల నీడల్ని అనుభవించడాన్ని,
[illegible] సీమల్లో నిశ్శబ్ద సూర్య నిష్క్రమణల్ని చూసి
[illegible]లానందాన్ని పొందడాన్ని,
[illegible] రాత్రి సమీపంలో సాగి వస్తున్నప్పుడు
[illegible] తియ్యని ఝుంకారాన్ని,
[illegible] మేసే గుర్రాల సకిలింతల్ని వినడాన్ని, కోరుకుంటున్నాం.
[illegible] మీద పెత్తనం చలాయించాలనే ఇచ్ఛలేదు మాకు
[illegible] అన్నాన్ని అందరూ పంచుకుందామనే ఉద్దేశమొక్కటే మాది
[illegible] లేకుండా పరిచయమైన వీధుల్లో తిరగాలనీ
[illegible] నక్షత్ర స్థగిత నీలాకాశంలోకి
[illegible] చూడాలనీ
[illegible] నిర్భయంగా నిద్రపోవాలనీ కోరుకుంటున్నాం.
[illegible] అర్థమైందే
[illegible] సమస్తం!

ఆం.ప్ర. అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణలు

"అభ్యుదయ" ప్రత్యేక సంచికలు

	రు. పై.
★ గోర్కీ సాహిత్య సంచిక	8-00
★ అరసం ఉద్యమ చారిత్రక-సాహిత్య పత్రాల సంచిక	13-00
★ సాహిత్య విమర్శ సంచిక	5-00
★ ఆధునిక కవిత్వ సంచిక	6-00
★ రోణంకి అప్పలస్వామి సంచిక	8-00

విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలలో లభిస్తాయి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001.

Edited, Printed and Published by : Yetukuri Prasad on behalf of A.P. Progressive Writers Association, 3-6-737/3, Himayatnagar, Hyderabad-29, at Tirumala Fine Art Printers, VST Road, Vidyanagar, Hyd-44